ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 3 ఏప్రిల్ 2025



అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకోండి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : ఇండియన్ నేవీ అగ్నివీర్ సీనియర్ సెకండరీ రిక్రూట్ (ఎస్ఎస్ఆర్) కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్ విద్యార్హతతో పురుషులతోపాటు మహిళలు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫిజికల్, మెడికల్ టెస్టులతో నియామకాలు ఉంటాయని, అవకాశం వచ్చినవారు శిక్షణతో కలిపి నాలుగేళ్ల సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. ఆ తర్వాత వీరిలో 25శాతం మందిని శాశ్వత ఉద్యోగులుగా తీసుకుంటారని తెలిపారు. మిగిలిన వారికి ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తారని తెలిపారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వ్యూహాత్మకంగా రైళ్లు ఆపి దోపిడీకి ప్లాన్ ● 31న పరిశీలన, 1న విజయవాడలో రైళ్లు ఎక్కిన దుండగులు

మరికొందరు అల్లూరురోడ్డు వద్ద హైవేపై కాపలా ● సరిగ్గా నిర్ణీత ప్రాంతానికి వచ్చాక సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్





ముందుగానే రెక్కీ!



వాళ్లంతా పక్క రాష్ట్రాలకు చెందిన వారు. మన జిల్లా పరిధిలో రైలులో దోపిడీ కోసం అనువైన ప్రదేశాన్ని ఎంచుకున్నారు. తుపాకులు, కత్తులు వంటి మారణాయుధాలు చూపలేదు. చేతి లాఘవాన్నే ప్రదర్శించారు. అనుకున్న పని పూర్తి చేసే క్రమంలో ప్రయాణికులు తిరగబడటంతో కాలి సత్తువను చాటుకున్నారు. దొరికిన బంగారు ఆభరణాలతో మన పోలీసులకు చిక్కకుండా హాయిగా పారిపోయారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన సమయంలో అల్లూరురోడ్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో జరిగిన ఈ రైలు దోపిడీకి సంబంధించి పోలీసు అధికారులు, ప్రయాణికులు అందించిన సమాచారం మేరకు..

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

సోమవారం రాత్రి..

పక్కరాష్ట్రాలకు చెందిన గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి అల్లూరు రోడ్డు స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో ఉన్న రైల్వే హోం సిగ్నల్‌కు 500 మీటర్ల దూరంలో ఉన్న జాతీయ రహదారిపై వాహనాలు ఆపి పొలాల గుండా నడుచుకొంటూ హోం సిగ్నల్ వైపు నడిచారు. కాసేపు అక్కడ గడిపి వారిలో వారు ఏదో మాట్లాడుకొని తిరిగి వచ్చి వాహనాలు ఎక్కి విజయవాడకు వెళ్లారు.

మంగళవారం రాత్రి ఇదే వ్యక్తులు విజయవాడ స్టేషన్‌లోకి వెళ్లారు. సుమారు ఒక పది మంది హౌరా ఎక్స్‌ప్రెస్‌లోకి, మరి కొందరు మధురై ఎక్స్‌ప్రెస్ రైలులోకి ఎక్కి స్లీపర్ బోగీల్లోకి వెళ్లారు. ఈ రెండు రైళ్లు గమ్యం వైపు బయలుదేరాయి.

వీటికన్నా కొన్ని గంటల ముందే రెండు జీపులు విజయవాడ నుంచి బయలుదేరి అల్లూరు రోడ్డు హోం సిగ్నల్‌కు సమాంతరంగా జాతీయ రహదారి పక్కన ఆగియి. సమయం గడుస్తోంది. విజయవాడ నుంచి బయలుదేరిన రైళ్లు శరవేగంగా గమ్యం వైపు దూసుకొస్తున్నాయి. ఆ రైళ్లలో ఎక్కిన దుండగులు తాము ఎక్కిన బోగీల్లోని ప్రయాణికులను నిశితంగా పరిశీలిస్తూ కూర్చున్నారు.

సమయం అర్ధరాత్రి 11 గంటలు దాటుతోంది. రైళ్లు బిట్రగుంట దాటుకొని అల్లూరురోడ్డు వైపు వస్తున్నాయి. ఇక్కడ జాతీయ రహదారి పక్కన వాహనాలను పార్కు చేసిన వ్యక్తుల పొలాల మీదుగా ముందుగా వారు నిర్ణయించుకున్న రైల్వే ట్రాక్ పక్కకు చేరుకున్నారు. ఇంకొద్ది నిమిషాల్లో రైళ్లు అక్కడకు చేరుకోబోతున్నాయి. రైలు సిగ్నల్ కోసం ఎదురుచూసే సమయంలో హోం సిగ్నల్ స్తంభం నుంచి రెడ్ లైట్ వెలిగింది. అయితే అప్పటికే హౌరా ఎక్స్‌ప్రెస్ ఆ సిగ్నల్ లైట్‌ను దాటేయడంతో ఆగకుండా వెళ్లిపోయింది.


సీసీ పుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

కొద్ది నిమిషాల వ్యవధిలో రెండో రైలు మధురై ఎక్స్‌ప్రెస్ వస్తోంది

ఈసారి అక్కడ కాపుకాచి ఉన్న దుండగుల గురి తప్పలేదు. దిగ్విజయంగా సిగ్నల్ ట్యాంపరింగ్ చేశారు. బ్లూ లైట్ బదులు రెడ్ లైట్ వెలిగేలా చేశారు. ఇంకేముంది.. లైన్ క్లియర్ కాలేదేమోనని లోకోపైలెట్ రైలు ఆపాడు.

● **ప్రయాణికుల తెగువ అద్భుతం**

ఖచ్చితంగా రైలు ఆగుతుందని ముందే సమాచారం ఉన్న ఆగంతకులు శరవేగంగా కదిలారు. ముందే వారు పరిశీలించి ఎంచుకున్న వ్యక్తుల వద్దకు వెళ్లారు. మెడల్లోని బంగారు చైన్లు లాగారు. చేతిలోని బ్యాగులు లాక్కున్నారు. స్లీపర్‌కు చెందిన మూడు బోగీల్లో ఒకేసారి అటాక్ చేశారు. అన్ని బోగీల నుంచి ఒకేసారి ఆహాకారాలు మొదలయ్యాయి. ఊహించని సంఘటన నుంచి నిమిషాల్లో తేరుకున్న ప్రయాణికులు చైన్లు తెంచుతున్న దొంగలపై తిరగబడ్డారు. పట్టుకోవాలని ప్రయత్నించారు. దొంగలకు పరిస్థితి అర్థం అయ్యింది. పట్టుబడతామనే భయం కలిగింది. వెంటనే బోగీల నుంచి కిందకు దూకేశారు.


మంగళవారం అర్ధరాత్రి ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఆర్పీఎఫ్, పోలీసులు

ప్రయాణికులు సైతం వారిని పట్టుకోవడానికి కిందకు దిగడానికి సిద్ధపడ్డారు. వీరిని అడ్డుకోవడం కోసం ముందే అక్కడ ఉన్న వ్యక్తులు రైలు పైకి రాళ్లు విసిరారు. దీంతో ప్రయాణికులు తలుపులు, కిటికీలు మూసేశారు. ఈ తతంగం అంతా సుమారు 20 నిమిషాలపాటు సాగింది.

ఇంతలో అక్కడ డ్యూటీలో ఉన్న గార్డు తేరుకున్నాడు. బ్లూ సిగ్నల్ ఇచ్చినా రైలు ముందుకు కదలకపోవడంతో ఏదో ప్రమాదం జరిగిందని ఊహించాడు. వెంటనే రైల్వే పోలీసులను హెచ్చరించారు. నిమిషాల వ్యవధిలో అక్కడకు రైల్వే, సివిల్ పోలీసులు చేరుకున్నారు. కానీ అప్పటికే ఈ దొంగల గుంపు ఉడాయించింది.

ఇలా పోలీసుల నుంచి సులభంగా తప్పించుకోవడానికి అనువుగా ఈ ప్రదేశాన్ని ఎంచుకున్నారు. అందుకోసం ఒకరోజు ముందే రెక్కీ నిర్వహించారు. జాతీయ రహదారికి పక్కన ఉన్న ప్రదేశాన్ని ఎంచుకున్నారు. అలాగే ఆ ప్రదేశానికి రాత్రి బాగా చీకటి పడిన తరువాత వచ్చే రైళ్లను ఎంపిక చేసుకున్నారు. అనుకున్న పని పూర్తి చేసుకుపోయారు. పోలీసులకు అందనంత దూరం వెళ్లిపోయారు. ఈ గుర్తు తెలియని దొంగల ముఠా సభ్యులు మహారాష్ట్రకు చెందినవారై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.


అక్రమ లేఅవుట్‌లో తీసిన కాలువ

మునిగిపోయాం.. ఇప్పుడేం చేద్దాం!

- కావలిలో ప్లాట్ల కొనుగోలుదారుల లబోదిబో
- అక్రమ లేఅవుట్లలో 128 ఎకరాలు గుర్తించిన అధికారులు
- పరారీలో రియల్టర్లు.. కొనుగోలుదారులకు నోటీసులు
- హద్దు రాళ్లు, రోడ్ల తొలగింపు.. నిర్మాణాలకు అనుమతి నిరాకరణ
- సర్వే చేసి, భూములను స్వాధీనం చేసుకుంటాం : ఆర్డీవో

8లో...



కలెక్టరేట్ ప్రవేశ ద్వారం ముందు ఆందోళన చేస్తున్న ఫాప్టో నాయకులు

పీఆర్సీ, ఐఆర్‌ను వెంటనే విడుదల చేయాలి

- కారుణ్య నియామకాలూ చేపట్టాలి
- కలెక్టరేట్ ఎదుట ఫాప్టో నిరసన

8

నేటి నుంచి టెన్త్ 'స్పాట్'

- మూల్యాంకనానికి సర్వం సిద్ధం
- జిల్లాకు 1,92,920 సమాధాన పత్రాలు
- విధుల్లో 1,558 మంది సిబ్బంది
- సీసీ కెమెరాలతో నిఘా

8లో...


హాల్‌టికెట్ల నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జేఈఈ మెయిన్స్-2 పరీక్షలు ప్రారంభం

● 9వ తేదీ వరకు నిర్వహణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 2 నుంచి 9వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయ, మధ్నాహ్నం రెండు బ్యాచ్‌లుగా జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 6వేల మందికిపైగా విద్యార్థులు హాజరవుతున్నట్లు కళాశాలల నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం జొన్నవాడ రోడ్డులోని ఆయాన్ డిజిటల్ కేంద్రంలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు.

● **నిబంధనల నడుమ పరీక్షలు....**

జేఈఈ మెయిన్స్‌కు హాజరవుతున్న విద్యార్థులకు హాల్‌టికెట్‌తోపాటు పరీక్షా కేంద్రంలో పాటించాల్సిన నియమ, నిబంధనలతో కూడిన నియమావళిని ఇప్పటికే అందచేశారు. తొలిరోజు ఉదయం 7.30 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించి 9 గంటలకు మెయిన్ గేట్లు మూసేశారు. విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్, పాస్‌పోర్టుసైజు ఫోటో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన ఒరిజినల్ గుర్తింపు కార్డును తీసుకుని హాజరయ్యారు. సెల్‌ఫోన్ సహా ఎలాంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను కేంద్రంలోకి అనుమతించలేదు. అయితే నిర్ణీత సమయం ముగిశాక ఏడుగురు విద్యార్థులను అనుమతించలేదు.

మన సపోటాపై తమిళ వ్యాపారుల పెత్తనం!

- చెప్పిన ధరకే పంపాలని ఒత్తిడి
- వ్యాపారులు, దళారుల మధ్య నలిగిపోతున్న రైతులు
- ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు
- ఏడాదికేడాది తగ్గిపోతున్న సాగు విస్తీర్ణం

ఉలవపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు సపోటాకు దశాబ్దాల కాలంగా రుచి పరంగా మంచి పేరుంది. రెండు తెలుగు రాష్ట్రాలలోని పట్టణాలలో కూరగాయల మార్కెట్ వద్ద, తోపుడు బండ్లపై, రైలు బండ్లలో వ్యాపారులు ఉలవపాడు సపోటా అని పేరు చెప్పందే కొనుగోలుదారు లను ఆకర్షించలేని పరిస్థితి. కాలక్రమేణా మామిడి, సరుగుడు, జామాయిల్ వంటి వాణిజ్య పంటలతో పోటీపడి మార్కెట్‌లో లాభాల విషయంలో సపోటా సరితూగలేక పోయింది. 30 ఏళ్ల క్రితం సపోటా వ్యాపారంలో రూ.లక్షలు సంపాదించిన రైతులు, దళారులు, వ్యాపారులు మండలంలో కళకళలాడారు. ఆరోజుల్లో సపోటా వ్యాపారంలో సంపాదించి స్థిరాస్తులు కూడపెట్టిన వాళ్లే నేడు రూ.కోట్లకు అధిపతులుగా ఉన్నారు. అయితే, రైతు మాత్రం అంతకంత సరిపెట్టుకుంటూ అలాగే మిగిలి పోయాడు. ఏడాదికి సపోటా రెండు కాపులు ఇస్తున్నా కూలీలు, సేద్యపు ఖర్చులకు తగ్గట్టు మార్కెట్లో ధర మాత్రం ఆశించినస్థాయిలో ఉండటం లేదని సాగుదారులు ఆవేదన చెందుతున్నారు.

● **చెన్నై వ్యాపారుల శాసనం**

ఉలవపాడులో పదికిపైగా సపోటా మార్కెట్లు ఉన్నాయి. కోతకు వచ్చిన సపోటాను బస్తాల ద్వారా ఉలవపాడు మార్కెట్‌కు రైతులే వాహనాల్లో తరలించాల్సి వస్తోంది. అధిక ధర పలికే పారిన్ సపోటా బస్తా రూ.700, బిళ్ల సపోటా రూ.550, పాల సపోటా రూ.650 నిన్నటి వరకు సాగింది. తమిళనాడులో స్థానిక సపోటా దిగుబడి రావడంతో రేట్లు తగ్గిస్తేనే సరకు రవాణా చేయాలని అక్కడి వ్యాపారులు ఆదేశించడంతో స్థానిక బ్రోకర్లు తలలు పట్టుకున్నారు. రైతు వద్ద బస్తాకు రూ.100 మార్జిన్‌తో మార్కెట్ కొనుగోలు చేస్తారు. కోత కూలి మగవారికి రూ.450, మహిళలకు రూ. 400లతోపాటు 60 కిలోల గోతాముకు రైతులు రూ.30 చెల్లించాల్సి వస్తుంది. ఇప్పుడు చెన్నై వ్యాపారుల సూచనల మేరకు ధర తగ్గించి పంపకపోతే సరకు ఇక్కడే ఆగిపోతుంది. ఇలా చేస్తే నష్టపోయేది రైతే. బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు చిత్తూరు, తాడిపత్రి నుంచి సపోటా ఎగుమతులు జరుగుతున్నందున ఉలవపాడు సపోటా ఎగుమతులకు ఏప్రిల్ రెండో వారం వరకు ఎదురు చూడాలని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు

ఉలవపాడు మండలంలోని మన్నేటికోట, ఆత్మకూరు, కరేడు, చాగొల్లు, చాకిచర్ల, వీరేపల్లి గ్రామాల్లో సుమారు 2500 హెక్టార్లలో సపోటా సాగు ఉండేది. గడిచిన పుష్కర కాలంలో కాలక్రమేణా సగానికిపైగా సపోటా తోటలు నరికేసి ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్నారు. ఆత్మకూరు, మన్నేటికోట, కరేడు గ్రామాల్లో ఇప్పుడు సపోటా సాగు కనిపిస్తుంది. ఎక్కువగా పునాస మామిడి, జామాయిల్, సరుగుడు తోటలు సాగులో ఉన్నాయి. పునాస ఏడాదికి రెండు కాపులు ఇస్తు రూ. లక్షల్లో సంపాదన ఇస్తుంది. అదేవిధంగా జామాయిల్, సరుగుడు మూడేళ్లకే ఎకరాకి సుమారు రూ.2 లక్షలు వరకు లాభాలను ఇస్తుంది. ఏడాదంతా సేద్యం చేసి సాగు చేసినా ఎకరాకి రూ. 20వేలకు మించి సపోటా కాపు కొనుగోలు చేయరు. అందులో పెట్టుబడి పోగా మిగిలేది నగంలో నగం మాత్రమే. తొలి నుంచి సపోటా పంటకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు ఉండవు. విపత్తు సమయంలో చెట్లకు నష్టం కలిగితే ప్రభుత్వం నష్టపరిహారం మాత్రమే అందిస్తుంది.


సపోటా బస్తాలను మార్కెట్‌కు చేరుస్తున్న కూలీలు


సపోటా చెట్లు నరికి వాటి స్థానంలో సాగు చేస్తున్న జామాయిల్

లాభాలు లేకనే..

అనతి కాలంలో లాభాలు ఇచ్చే పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. పెద్దగా లాభాలు రావడంలేదని సపోటాను కాదని ప్రత్యామ్నాయ పంటలు పునాస, సరుగుడు, జామాయిల్ వైపు చూస్తున్నారు. ఉద్యాన పంటల్లో సపోటాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు ఉండవు. రైతుకు లాభసాటి అనిపించే పంటలకే ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో సపోటా చెట్ల స్థానంలో మరో పంట సాగు చేస్తున్నారు.

- బీ జ్యోతి, మండల ఉద్యాన అధికారిణి



సరైన ధర లేకనే!

ఏళ్ల తరబడి సపోటా సాగు చేస్తున్నా. గత పదేళ్లుగా పెట్టుబడికి అమ్మకానికి సరిపోతుందే తప్ప సరైన లాభాలు లేవు. అందుకే 6 ఎకరాల వరకు సపోటా చెట్లు తొలగించి జామాయిల్ సాగు చేస్తున్నా. మూడేళ్లకు కోతకు వచ్చి ఆశించిన లాభాన్ని ఇస్తుంది. పైగా మరో కోతకు సిద్ధం అవుతుంది.

- అమరనేని రాములు, సపోటా రైతు, ఆత్మకూరు గ్రామం



చేతికందాల్సిన రూ.30 కోట్లు వెనక్కి

● లబోదిబోమన్న కార్పొరేషన్ కాంట్రాక్టర్లు

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 2, (ఆంధ్రజ్యోతి) : ముగిసిన ఆర్థిక సంవత్సరంతో నెల్లూరులో వివిధ అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు చేతికందాల్సిన రూ.30 కోట్లు బుధవారం వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో వారంతా లబోదిబోమంటూ కమిషనర్ సూర్య తేజ వద్ద బోరుమన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు పలువురు కాంట్రాక్టర్లు అనేక పనులు చేశారు. వీరికి తుది బిల్లుల కింద అందాల్సిన సుమారు రూ.30 కోట్లు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడై ఉంది. అక్కడ నుంచి ఎప్పుడైనా తమ ఖాతాల్లో నగదు జమ అవుతుందని కాంట్రాక్టర్లు గ్రహించారు. ఇంతలో ఆ మొత్తం కార్పొరేషన్‌లోని హెడ్‌ఆఫ్‌ది అకౌంట్స్‌కు వెనక్కి జమవడంతో వారంతా ఖంగుతిన్నారు. వెంటనే పరుగులు తీసి కమిషనర్ క్యాంపు కార్యాల యానికి చేరుకుని సూర్యతేజతో భేటీ అయ్యారు. ఆయన ఇచ్చిన హామీతో వారంతా వెను తిరిగారు.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయంలో బుధవారం 53.160 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 330, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఏపీడీ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉదయగిరి క్లస్టర్ ఏపీడీగా ఎం మృధుల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కోవూరు క్లస్టర్ ఏపీడీగా విధులు నిర్వహిస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా ఉదయగిరి ఏపీడీగా ఉన్నతాధికారులు నియమించడంతో బాధ్యతలు చేపట్టారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల ఏపీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8765
వెండి కిలో ధర	రూ. 1,02,600
వెండి ఒక గ్రాము	రూ.105.60

సరదా మాటున పొంచి ఉన్న ప్రమాదం

- ఈతకు వెళ్లి మృత్యువాత పడుతున్న చిన్నారులు
- తల్లితండ్రుల అప్రమత్తత అవసరం


ఉత్తర కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు (ఫైల్)

ఆత్మకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు మండుతున్నాయి. విద్యార్థులకు సెలవులు ఇచ్చారు. సేద తీరేందుకు విద్యార్థులు, యువకులు ఈతకెళ్లేందుకు సరదా చూపుతారు. ప్రధానంగా గ్రామీణప్రాంతాల్లో బా వులు, చెరువుల్లో పిల్లలు ఈత కొట్టడం పరిపాటి. ఈత మీద సరదాతో శిక్షణ లేకపోయినా చిన్నారులు సరదాగా మునిగేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఆ సరదా మాటునే ప్రమాదం పొంచి ఉంటుందని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రెండురోజుల క్రిత ం అనంతసాగరం మండలం మినగల్లుకు చెందిన యువకుడు తన మిత్రు లతో కలిసి ఉత్తరకాలువ వద్దకు ఈతకు వెళ్లి మృతిచెందిన విష యం విధితమే. జిల్లాలో ఏడాదికి 10 నుంచి 15 మంది చిన్నారులు నీట మునిగి మృత్యువాతపడుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చెరువులు, బావుల్లో ఈతకెళ్లేవారు ఈత వచ్చిన సహాయకులు లేకుండా వెళ్లరాదు. ఈతరానివారిని ఈతకెళ్లనీయకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. కొత్తగా ఈత నేర్చుకుంటున్న పిల్లలు నడుముకు సొరకాయబుర్ర, బెండ్లు, రబ్బరు, ట్యూబ్‌లు, తాళ్లు లాంటివి కట్టుకోవాలి. బావులు, కొలనుల్లో నీటి లోతును గమనించి ఈతకు దిగడం మంచిది. రాతికట్టడం ఉన్న బావుల్లో పైనుంచి దూకడం వలన అదుపుతప్పి రాళ్ల మీద పడే అవకాశం ఉంది. బావిపై నుంచి తలకిందులుగా నీళ్లల్లో దూకరాదు. పక్కను న్న రాళ్లకు, గట్టి నేలకు తలకొట్టుకుంటే ప్రాణాలు పోయే అవకాశం ఉంది. చెరువుల్లోకి ఈతకు వెళ్లే ముందు అక్కడ లోతైన గుంతలు, పూడిక, నాచు గురించి తెలుసుకోవాలి. కాలువల్లో ఈతకు వెళ్లకపోవడం శ్రేయస్కరం.

ప్రమాద హెచ్చరిక బోర్డులు ర్పాటుచేయాలి

ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి జిల్లా అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. పెన్నానది పరివాహక ప్రాంతాలు, ఉత్తర కాలువ సమీప ప్రాంతాల్లోని పలువురు చిన్నారులు ఆయా ప్రాంతా లకు ఈతకు వెళుతున్నారు. ప్రమాదం పొంచి ఉంది. సోమశిల జలా శయం దిగువ ప్రాంతంలో లోతైన సుడిగుండాలు ఉన్నాయి. పర్యటనకు వచ్చి గతంలో పలువురు మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి. సంగం మండలంలోని పలు గ్రామాల్లో ఈతకు వెళ్ళి పలువురు మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి. గ్రామాల్లో చిన్నారుల తల్లిదండ్రులకు అధికారులు అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఈవోపీఆర్డీ


రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ భార్గవి

సీతారామపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఈవోపీఆర్డీ భార్గవి సూచించారు. మండల పరిధిలోని బసినేనిపల్లి, బాలయపల్లి గ్రామ సచివాలయాలను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీచేసి, సిబ్బంది హాజరు, పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయంలో అందాల్సిన సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆదిశగా సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం బసినేనిపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఐవీఆర్ఎస్ కాల్స్ పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలి : ఎంపీడీవో


ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

సీతారామపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఎంపీడీవో భాస్కర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీల హాజరు, ఆన్లైన్ నమోదుతో పాటు పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనులు లేవని ఎవరూ చెప్పకూడదని, ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. ప్రతీవారం లేబర్ ఇంప్రూవ్‌మెంట్ చేపట్టకపోతే సిబ్బందిపై ఉన్నతాధికారులకు నివేదికను పంపించడంతో పాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఈసి సువర్తయ్య, టీఏలు మురళి, రంగనాథ్, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దిబ్బలతో వాహనదారుల ఇక్కట్లు


కనిగిరి రిజర్వాయర్ వంతెన వద్ద పేరుకుపోయిన ఇసుక

సంగం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సంగంలో కనిగిరి రిజర్వాయర్ పాత వంతెన వద్ద ఇసుక దిబ్బలతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సూరాయపాళెం ఇసుక రీచ్ నుంచి అధికలోడు ఇసుకతో వచ్చే టిప్పర్ల నుంచి వంతెన ప్రవేశం వద్ద ఇసుక జారీ దిబ్బలుగా పేరుకుంటోంది. ఇటీవల వరకు బ్యారేజి వద్ద తాత్కాలిక లస్కర్లు విధుల్లో ఉండడంతో ఇసుక పక్కకు తొలగించేవారు. ప్రస్తుతం సీజన్ ముగియడంతో లస్కర్లను తొలగించారు. దీంతో ఇసుక తొలగించే సిబ్బంది లేక వేగంగా వచ్చే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అసలే వంతెన రక్షణ కమ్ములు దెబ్బతిని ఉండడంతో ప్రమాదకరంగా ఉంది. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పితే పది అడుగుల లోతు ఉండే కాలువ నీటిలో పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి అధిక లోడు వాహనాలను అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

శిథిలావస్థలో వ్యాపార సముదాయం


నిరుపయోగంగా ఉన్న గదులు

అనంతసాగరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట గతంలో నిర్మించిన వ్యాపార సముదాయం నిరుపయోగంగా ఉండడంతో గదులు శిధి లావస్థకు చేరుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మా ర్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో బద్వేల్ రోడ్డు పక్కనే ఆరు గదులు నిర్మించారు. వాటిని బాడుగకు ఇచ్చేలా చర్యలు తీసుకోలేదు. దీంతో అవి శిథిలావస్థకు చేరుతుండగా కొన్ని గదుల షట్టర్లను అపహరించారు. మరి కొన్ని గదుల్లో అనధికారికంగా కొందరు సామగ్రి భద్రపరచుకొని వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధి కారులు స్పందించి గదులకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసు కుంటే ప్రభుత్వానికి ఆదాయం సమ కూరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

రోడ్డుపైకి మురుగునీరు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

సంగం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సంగం మేజర్ పంచాయతీ రాళ్లచెలికలో డ్రైనేజి పూడిపోయి మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పాదచారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలో పోలీస్‌స్టేషన్ రహదారి పక్కన ఉన్న డ్రైనేజి నీరు వెళ్లేందుకు సంగం రహదారి పక్కన తాత్కాలిక డ్రైనేజి ఏర్పాటు చేశారు. ఈ మురికినీరు ఎస్సీ హాస్టల్ ముందు ఉన్న కల్వర్టు గుండా బీడు పొలాల్లోకి వెళతాయి. అయితే సంగం రహదారి పక్కన ఉన్న తాత్కాలిక డ్రైనేజి పూడిపోయి మురికినీరు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో వాహనాలు వెళ్లేటప్పుడు మురికినీరు పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై పడుతున్నాయి. దీంతో అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తాత్కాలిక డ్రైనేజిలో పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

పేకాట స్థావరంగా అనంతసాగరం

అనంతసాగరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పేకాటకు స్థావరంగా అనంతసాగరం పేరుగాంచింది. జిల్లాకు ఈ మండలం దూరంగా ఉండడంతో సూదర ప్రాంతాల నుంచి జూదరులు ఇక్కడకు వచ్చి పేకాట ఆడుతున్నారు. దీంతో బాధితుల కుటుంబాలు ఆర్థికంగా ఛిన్నాభిన్నమవుతున్నాయి. పేకాటతో రూ. లక్షలు చేతులు మారుతుండగా ఎంతో మంది అప్పుల పాలవుతున్నారు. రోజుకో ప్రాంతంలో స్థావరాలు వెలుస్తున్నాయి. పోలీసులు స్పందించి జూదాన్ని అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

పట్టించుకోని అధికారులు

ఏఎస్ పేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ల వద్ద సరైన భద్రత లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథు డే లేడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఏఎస్‌పేట నడిబొడ్డున నగరఖానా సెంటర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి చుట్టూ ఎటువంటి కంచె ఏర్పాటు చేయలేదు. అదేవిధంగా పలు గ్రామాలు, పొలాలు, ఊరు శివార్లలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్‌ల వద్ద ఎటువంటి భద్రత చర్యలు లేవు. దీంతో వాటి చుట్టూ మొక్కలు, గడ్డి మొల వడంతో పశువులు అటుగా వెళ్లి విద్యుదా ఘాతానికి గురై మృతి చెందుతున్నాయి.

ఇళ్లకు ఆనుకుని కరెంటు తీగలు

ఏఎస్ పేట గ్రామంతో పాటు పలు గ్రామాలలో విద్యుత్ తీగలు ఇళ్లకు అనుకొని ఉన్నాయి. ప్రముఖ యాత్రా స్థలం కావడంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు కూడా అంతే వేగంగా సాగుతున్నాయి. కొందరు రోడ్డును సైతం ఆక్రమించి విద్యుత్ తీగల కింద వరకు ఇళ్లు నిర్మిస్తు న్నారు. దర్గా సెంటర్‌లో విద్యుత్ స్తంభం సమీ పంలో ఇళ్ల నిర్మాణాలు చేసినా పట్టించు కోకపోవడంతో ప్రమాదాలు సంభ విస్తున్నాయి. అంతేకాకుండా దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన స్తంభాలు కావడంతో తీగలు కిందకు వేలాడు తున్నాయి. ఏడాది క్రితం గ్రామంలోని కృష్ణ మందిరం వీధిలో ఇంటిపై ఉన్న వాటర్ ట్యాంక్ శుభ్రం చేయడానికి వెళ్లిన కూలి ఇంటికి అనుకొని ఉన్న విద్యుత్ తీగను గమనించ కుండా తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే పొలాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగల వలన రైతులు విద్యుదాఘాదానికి గురై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇప్ప టికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటుచేయాలని, విద్యుత్ తీగలు కిందకు వేలాడకుండా చర్యలు చేపట్టి ప్రమాదాలు నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ఏఎస్ పేటలోని నగరఖానా సెంటర్‌లో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్


ఇంటికి అనుకుని ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన వ్యక్తి (ఫైల్)


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన గేదె (ఫైల్)

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైదులు, ఎస్ఐ



ఏఎస్ పేట, ఏప్రిల్ 2 (ఆంధ్ర జ్యోతి): ప్రస్తుతం టెక్నాలజీ పెరగడంతో సైబర్ నేరాలు అధికమవుతున్నాయి. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ పేట ఎస్ఐ సైదులు తెలిపారు.

? సైబర్‌నేరాలకు ఎలా పాల్పడతారు.

! బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నాం.. మీ ఏటీఎం కార్డు టైం ముగిసింది.. అంటూ కార్డు వివరాలు తెలపమని అడుగుతారు. ఓటీపీ నెంబరు తెలుసుకుని కార్డులోని డబ్బులు దొంగిలిస్తారు. అలాగే బహుమతి వచ్చింది.. ముందుగా ట్యాక్స్ కట్టాలని మోసం చేస్తారు. కస్టమ్స్ వద్ద పార్శిల్ చిక్కుకుపోయింది అని, చట్ట విరుద్ధమైన వస్తువులు కలిగి ఉన్నారని, జరిమానా విధించాలని డిమాండ్ చేస్తారు.

? డిజిటల్ అరెస్టు అంటే ఏమిటీ.

! స్కామ్ చేసేవారు ఫోన్ చేసి ఆదాయానికి మించి లావాదేవీలు జరిపారు.. మీ అకౌంట్‌కు అక్రమంగా డబ్బులు వచ్చాయి.. మిమ్మల్ని ఆన్‌లైన్‌లో విచారిస్తామని బెదిరిస్తారు.

? సైబర్ నేరాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

! ఇలాంటి ఫోన్ కాల్స్ వచ్చినపుడు అప్రమత్తంగా ఉండాలి.. అకౌంట్ నుంచి నగదు కట్ అయితే వెంటనే 1930కి ఫోన్‌చేసి వివరాలు తెలిపితే, అకౌంట్‌ను హోల్డ్ చేస్తారు.

న్యూస్ బాక్స్

యాదవ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


నరసింహయాదవ్‌ను సన్మానిస్తున్న చెంచలబాబు


ఉదయగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహయాదవ్‌ను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, దుత్తలూరు మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నరసింహయాదవ్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో వారు పాల్గొని సన్మానించారు. రాష్ట్రంలో యాదవుల సంక్షేమానికి కృషి చేయాలని చైర్మన్‌ను కోరినట్లు వారు తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉదయగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని కంసాలి వీధికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కల్లూరి నారాయణరెడ్డి మృతికి మండల యూటీఎఫ్ శాఖ బుధవారం సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి, ఫణిరాజ్, సుబ్బారెడ్డి, ఏడుకొండలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు


వాడుకలో లేని మరుగుదొడ్లు

వింజమూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్మల్ భారత్ అభియాన్ రాజీవ్ విద్యామిషన్ పథకం ద్వారా సుమారు రూ.1.40లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లు వాడుకలో లేక నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను ఇలా వదిలేయడంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని వాకర్స్ కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

విష గుళికలు మింగి యువకుడి మృతి

వెంకటాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరామపురంలో ఓ వ్యక్తి విష గుళికలు మింగి బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు, గ్రామానికి చెందిన బిరుదోలు హరిబాబు(36) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. సమస్యలు తీవ్రం కావడంతో విష గుళికలు మింగాడు. దీంతో ఆయన మృతి చెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామదాసుకండ్రిగ సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. సైదాపురానికి చెందిన రామయ్య, అశోక్ మోటార్ బైక్‌పై ముత్తుకూరులోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో నాయుడుపాళెం క్రాస్ రోడ్డు దాటాక రోడ్డు మలుపు రావడంతో ఆ ప్రాంతంలో కంకర రాళ్లు ఉండడం వల్ల బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో వారిద్దరూ గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిర్యానీ సెంటర్‌పై దాడి

- చంపేస్తామని నిర్వాహకులకు బెదిరింపు


దుండగులు ధ్వంసం చేసిన బిర్యానీ సెంటర్

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): కొందరు గుర్తు తెలియని యువకులు బుధవారం బుచ్చి బైపాస్ రోడ్డులోని ఓ బిర్యానీ సెంటర్‌ను ధ్వంసం చేశారు. యజమానులపై దాడి చేసి, చంపేస్తామంటూ బెదిరించారు. బాధితుల కథనం మేరకు, బుచ్చి పల్లిపాళేనికి చెందిన గిరిజనుడు యాటగిరి గోపి, దామరమడుగు మతంకాలనీకి చెందిన ముస్లిం యువతి షేక్ బీబీజాన్‌లు 11 ఏళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం బుచ్చి బైపాస్‌రోడ్డులో బిర్యానీ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రారంభించిన కొంతసేపటికి ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఈ సెంటర్‌ను ధ్వంసం చేశారు. అంతేకాక మిమ్మల్ని చంపేస్తామంటూ భార్యాభర్తలపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మంటల్లో చిక్కుకొని లారీల దగ్ధం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఆటోనగర్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో వ్యర్థాలు తగలబడటంతో పక్కనే ఉన్న లారీలు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.... సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో ఓ రోడ్డుపక్కన పెద్ద ఎత్తున చెత్తచెదారులు వేసి ఉన్నాయి. దాని పక్కనే లారీలు నిలిచి ఉన్నాయి. ప్రమాదవశాత్తు జరిగిందో లేక ఎవరైనా అగ్గి రాజేశారో తెలియదుగానీ చెత్తమండటం ప్రారంభమైంది. ఆ నిప్పు కాస్తా పక్కనే ఉన్న లారీలకు అంటుకుంది. మంటలు ఉవ్వెత్తున ఎగిపడుతుండటం గమనించి స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. అగ్నికి దగ్ధమైన లారీలు ఎవరివన్న సమాచారం లేదు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి


గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడు(60) మృతి చెందాడు. ఈ ఘటనపై దర్గామిట్ట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జీజీహెచ్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు అక్కడికి చేరుకొని వివరాల గురించి ఆరాతీశారు. తన గ్రామం కసుమూరు అని ఆ వృద్ధుడు చెబుతూ ఉండేవాడని కొందరు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440700018 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

కలెక్టరేట్‌లో మరుగుదొడ్లకు తాళం

- సందర్శకులకు అవస్థలు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ప్రాంగణంలో వందలాది మంది వినియోగించుకుంటున్న నగర పాలక సంస్థ మరుగుదొడ్లకు తాళం పడింది. ఈ మరుగు దొడ్ల పర్యవేక్షణ చూసే ఒక మహిళకు రెండు నెలలుగా జీతం ఇవ్వకపోవడంతో ఆమె ఆ మరుగు దొడ్లకు తాళం వేసి వెళ్లినట్లు సమాచారం. కలెక్టరేట్‌కు నిత్యం వందల మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. వారు ఆ మరుగుదొడ్లను విని యోగించుకుంటుంటారు. అయితే రెండు రోజులుగా తాళం వేయడంతో అత్యవ సరమైన వారు ఇబ్బంది పడుతున్నారు. మూతపడిన మరుగుదొడ్లను తెరిపించాలని కోరుతున్నారు.


కలెక్టరేట్ ప్రాంగణంలో తాళం వేసి ఉన్న నగర పాలక సంస్థ పబ్లిక్ టాయిలెట్లు

ఇది నిజమేనా...?



ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉదయగిరి 4 కిలోమీటర్లని జాతీయ రహదారి అధికారులు మైలురాయి ఏర్పాటు చేశారు. కాగా, విద్యుత్ సబ్‌స్టేషన్, గండిపాళెం మార్గంలో ఏర్పాటుచేసిన సర్కిల్ వద్ద నుంచి ఉదయగిరి సుమారు 1.5 నుంచి 2.5 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. అయితే మైలురాయిపై 4 కిలోమీటర్లని నమోదు చేశారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే కొత్త వ్యక్తులు ఈ మైలురాయిని చూసి అయోమయానికి గురవుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	248
స్కిన్‌లెస్	274

కోడిగుడ్ల ధర (100): 450



'కళారత్న అవార్డు' కావలికి గర్వకారణం : ఎమ్మెల్యే

కావలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలకుడు మాదవరావుకు రాష్ట్ర ప్రభుత్వం కళారత్న(హంస) అవార్డు అందజేయడం కావలికే గర్వకారణమని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కళారత్న అవార్డు పొందిన పట్టణానికి చెందిన ఇంద్రజాలకుడు వేములపాటి మాదవరావును బుధవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాదవరావు 35 ఏళ్లుగా తమకు ఆత్మీయుడన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం గౌరవాధ్యక్షుడు పోతుగంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటుకు సహకరించండి

లింగసముద్రం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రైమరీ పాఠశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈవో-2 ఎంవీ శివకుమార్ కోరారు. బుధవారం మండలంలోని పెదపవని స్కూల్ కాంప్లెక్స్ చెర్మన్ టీచ్రీనివాసులుతో కలిసి ఆయన ముత్యాలపాడు హెచ్‌పీ, మెయిన్ పాఠశాలలను, ముత్తంవారిపాలెం మెయిన్, ఎస్టీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్యాలపాడు మెయిన్ పాఠశాలలో ఇదే గ్రామంలోని హెచ్‌పీ పాఠశాలను, పెదపవనిలోని ఎస్టీ పాఠశాలను విలీనం చేసి మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఏర్పాటు చేస్తారన్నారు. అలాగే ముత్తంవారిపాలెం మెయిన్ పాఠశాలను అదే గ్రామంలోని ఎస్టీ పాఠశాలలో విలీనం చేసి ఎస్టీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఏర్పాటు చేస్తామన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారని చెప్పారు. ఆయా గ్రామాల్లోని ఫౌండేషన్ స్కూళ్లలో 1, 2 తరగతులు ఉంటాయని, ఒక ఉపాధ్యాయుడు, ఒక అంగన్వాడీ కార్యకర్త పనిచేస్తారని చెప్పారు.

ఆస్తి పన్ను రూ.9.41 కోట్ల వసూలు

కావలి ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : కావలి పురపాలక సంఘంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను రూ.9.41 కోట్ల వసూలు చేశామని కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం కన్నా రూ.1.58 కోట్లు అధికంగా వసూలు చేయడంలో తమ సిబ్బంది చేసిన కృషి చేశారని తెలిపారు. వడ్డీలో 50 శాతం రాయితీ ప్రకటించిన తర్వాత ఆరు రోజుల వ్యవధిలో రూ.1.26 కోట్ల వసూలు చేశామని పేర్కొన్నారు. పన్నుల వసూళ్లలో కృషి చేసిన ఆర్వో ఫణికుమార్, ఆర్‌ఐలు షేక్ షరీప్, సురేంద్ర సచివాలయాల పరిపాలనా కార్యదర్శులు, ఇతర కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందికి, పన్నులు చెల్లించిన ప్రజలకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

30 లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలి

అల్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల లబ్ధిదారులు ఈనెల 30 వతేదీ లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. గత నెలాఖరు వరకు సమయం ఉన్న ఈ ప్రక్రియను ప్రభుత్వం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈ-కేవైసీ చేసుకోకుంటే రేషన్ సరుకులు పొందే అర్హతను కోల్పోతారని పేర్కొన్నారు.

239 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 296 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొని 239 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-37, ఆర్‌ఆర్-2, సీఆర్-14, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 576 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.235, సగటు ధర రూ.272.35గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి : ఏపీవో

లింగసముద్రం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఉపాధి హామీ పథకం ఏపీవో షేక్ సమీర్‌బాషా చెప్పారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయని, మిగిలిన 4 పంచాయతీల్లో కూడా పనులు ప్రారంభించాలని చెప్పారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ 100 రోజుల పనిదినాలు ఉంటాయన్నారు. బోగస్ మస్టర్లు వేసే వారిపై చర్యలు తప్పవని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఏలు రాఘవ, శ్రీకాంత్, బీఎఫ్‌టీ ఎం జక్రయ్య పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాల్పుల దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఒంటిపూట బడులే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ కందుకూరులో ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు పాటించటం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన డిప్యూటీ డీఈఓ, ఇద్దరు ఎంఈఓలు చోద్యం చూస్తుండటం తగదని పేర్కొన్నారు. తక్షణం ఒంటిపూట బడులు నిర్వహించేలా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నిర్మాణ పనులు ఆగిపోయిన గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవనం

- 10 ఏళ్లుగా తుఫాన్ షెల్టర్‌లో గిరిజన బాలికల విద్యాలయం
- సమస్యల సుడిగుండంలో మగ్గుతున్న విద్యార్థినులు
- ఆందోళనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు
- కూటమి ప్రభుత్వంలోనైనా వినియోగంలోకి తెస్తారా?

గురుకులం భవనాలకు
మోక్షం కలిగేనా!?

ఉలవపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడులో గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన గిరిజన బాలికల గురుకులం భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో 10 ఏళ్లుగా బాలికలు తుఫాన్ షెల్టర్‌లో మగ్గుతున్నారు. వివరాల మేరకు.. ఎస్టీ బాలికల హాస్టల్‌ను 12 ఏళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం బాలికల గురుకుల పాఠశాలగా మార్చింది. అప్పటికే భవనం పూర్తిగా శిథిలావస్థలోకి చేరడంతో అదే స్థలంలో నూతన భవనం నిర్మాణం కోసం గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే పోతుల రామారావు నిధులు మంజూరు చేయించి టెండర్లు పిలిపించారు. నూతన భవనం నిర్మించే ఉద్దేశంతో పాత భవనంను తొలగించి చదును చేశారు. అదే పంచాయతీలోని రామకృష్ణాపురం గ్రామం తుఫాన్ షెల్టర్‌లోకి విద్యార్థినులను తరలించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ భవనానికి సంబంధించి నిధులు విడుదల నిలిపేసింది. టెండర్లు రద్దు చేసింది. ఆ తరువాత నాడు-నేడు కింద తొలివిడత రూ.2.64 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో 16 గదుల భవన నిర్మాణ పనులు చేపట్టారు. బిల్లులు మంజూరు అయ్యేకొద్దీ పనులు చేపడుతు సాగదీస్తూ వచ్చారు. రూ.1.15 కోట్లతో గదుల నిర్మాణం వరకు పూర్తి చేశారు.



పదేళ్లుగా బాలికల గురుకుల పాఠశాల నిర్వహిస్తున్న తుఫాన్ షెల్టర్

మంజూరైన నిధుల్లో ఇంకా సుమారు ఒకటిన్నర కోటి నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరైతే పనులు చేపడతామని ఇంజనీరింగ్ అధికారులు చేబుతున్నారు. నాడు-నేడులో నూతన భవనానికి నిధులు మంజూరు చేశారు కానీ చుట్టూ ప్రహరీకి నిధులు మంజూరు చేయలేదు. ఇప్పుడు భవనం పూర్తయినా చుట్టూ ప్రహరీ గోడకు సుమారు రూ.30 లక్షలు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు.

● తుఫాన్ షెల్టర్‌లో బాలికల అవస్థ

గిరిజన బాలికల గురుకులాన్ని రామకృష్ణాపురం తుఫాన్ షెల్టర్‌లోకి మార్చినప్పటి నుంచి విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణాతీతం. 3వతరగతి నుంచి 10వ తరగతి వరకు ఈ ఏడాది 165 మంది విద్యార్థినులు ఉన్నారు. తుఫాన్ షెల్టర్‌లో మొత్తం నాలుగు గదులు ఉన్నాయి. ఆ గదుల్లోనే తరగతులు నిర్వహణ, హాస్టల్, వసతితో సర్దుకొంటున్నారు. కాగా మరుగుదొడ్లు నాలుగు ఉండగా రెండు మరమ్మతులకు గురయ్యాయి. వర్షాకాలంలో విద్యార్థినుల అవస్థలు వర్ణాతీతమనే చెప్పాచు. విద్యార్థినుల అవస్థలు చూసిన తల్లిదండ్రులు ఈ ఏడాది సుమారు 60 మందిని తిరిగి ఇళ్లకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో గత నెలలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మింగా తనిఖీ చేయడంతో మరుగుదొడ్లు మరమ్మతుల కోసం రూ.3 లక్షలు మంజూరు చేయించారు.

● వచ్చే ఏడాదికైనా పూర్తయ్యేనా...

కూటమి ప్రభుత్వంలోనైనా పాలకులు, అధికారులు దీనిపై దృష్టి సారించి పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటారని అధ్యాపకులు ఎదురు చూస్తున్నారు. భవన నిర్మాణ పనులు, ఫ్లోరింగ్, లైటింగ్, పెయింట్ పనులు చేపట్టి నూతన భవనం వచ్చే విద్యా ఏడాదికైనా అందుబాటులోకి తెస్తారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీల భూముల్లో రోడ్డు వేయడం దుర్మార్గం

● సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో బాధితుల ఆందోళన



సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం పెదలాటరపిలో ఎస్సీ ఎస్టీల భూముల్లో గ్రామపెత్తందార్లు దౌర్జన్యంగా రోడ్డు వేయటం దుర్మార్గపు చర్య అని, తక్షణం వారిపై చర్యలు తీసుకుని నిరుపేద కుటుంబాలకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బాధిత రైతులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సీపీఎం ఏరియా కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెదలాటరపి గ్రామంలోని సర్వేనెంబరు 287లో ప్రభుత్వం 18 ఏళ్ల క్రితం భూమిలేని నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు 20 మందికి ఒక్కొక్కరికి 90 సెంట్లు చొప్పున పట్టాలివ్వగా వారు పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ భూములపై కన్నేసిన సోమినేని రవి, ముప్పా మల్లికార్జున, ముప్పా శోభన్‌బాబు, ఉప్పుటూరి నారాయణ తదితరులు అర్ధరాత్రి ఈ భూముల్లో రోడ్డువేశారని, ఇదేమి అన్యాయం అని అడిగిన నిరుపేద రైతులపై దౌర్జన్యం చేసి దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరిస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు సబ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ మాట్లాడుతూ మీ భూముల జోలికి వారు రాకుండా చర్యలు తీసుకుంటామని, యథావిధిగా సాగు చేసుకోవచ్చని హామీ ఇచ్చారు.

అడ్మిషన్ల కోసం అధ్యాపకుల ఇళ్ల బాట



విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న అధ్యాపకులు

ఉలవపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు బుధవారం విద్యార్థుల ఇళ్లబాట పట్టారు. ఇటీవల 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన ఉలపాడులోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న వసతులు, బోధన గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. ఈనెల 7వ తేది నుంచి జూనియర్ ఇంటర్ అడ్మిషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగు ఇస్తుందని, మధ్యాహ్న భోజనం సదుపాయం ఉందని వివరించారు. స్టడీ హవర్స్, ఐఎఫ్‌సీ ప్యానెల్స్ ద్వారా విద్యా బోధన, సైన్స్ విద్యార్థులకు మంచి ల్యాబ్, ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సేవా పథకం ద్వారా సర్టిఫికెట్, ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ క్లాసులు, స్పోర్ట్స్ నందు శిక్షణ, అత్యుత్తమ లైబ్రరీ, మినరల్ వాటర్, అనుభజ్ఞులైన అధ్యాపక బృందం ఉన్నందున మీ పిల్లలని చేర్పించాలని కోరారు. ఈ ఏడాది ఎంపీసీ, బైపీసీ రెండు గ్రూపుల బోధన తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ఉంటుందని, అదేవిధంగా సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు తెలుగు మీడయంలో అందుబాటులో ఉన్నట్లు క్యాంపెయిన్ నిర్వహించినవారిలో అధ్యాపకులు గారపాటి గోపీచంద్ ప్రకాష్, జ్యోతి, రఫి, సుబ్బాచారి, మాధవరెడ్డి, వల్లూరయ్య తదితరులు ఉన్నారు.

అవగాహనతోనే ఆటిజం దూరం



మాట్లాడుతున్న ఐఈఆర్‌పీ ఉదయలక్ష్మి

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఆటిజం దూరమవుతుందని ఐఈఆర్‌పీ కూనం ఉదయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని ఇస్కాలవారి వీధి ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినం సందర్భంగా హెచ్‌ఎం ఆర్.వేదవతి అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జన్యుపరమైన కారణాలతో ఆటిజం వ్యాధి వస్తుందని, ఇలాంటి వారిలో మానసిక ఎదుగుదల లేక సాధారణ జీవితం గడపటం కష్టంగా మారుతుందన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోకపోవడం, తీవ్రమైన భావోద్వేగాలకు గురవడం, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోకపోవటం, వారితో ఎక్కువగా గడపకపోవడం కూడా ఈ సమస్యకు కారణమన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ కోటేశ్వరరావు, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

● కందుకూరులో నిరసన ర్యాలీ

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కందుకూరు నియోజకవర్గంలోని పాస్టర్లు బుధవారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పామూరు రోడ్డులో ఉన్న ఎస్వీఎస్ కళ్యాణ మండపం నుంచి పామూరు రోడ్డు సర్కిల్, ఎన్టీఆర్ విగ్రహం, పోస్టాఫీసు సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నందున పోలీసు అధికారులు వాటిని నివృత్తి చేయాలని కోరారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

వర్క్‌ఫ్రం హోం సర్వే పూర్తి చేయాలి



సచివాలయ సిబ్బందితో సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎమ్పీడీవో శ్రీదేవి

కావలి రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సైతం స్త్రీ, పురుషులకు ఇంటి వద్దే ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్పీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. కావలి మండలంలోని అన్నగారిపాలెం, పెద పట్టపుపాలెం, రుద్రకోట, సిరిపురం, చలంచర్ల గ్రామ సచివాలయాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇంటి వద్దే ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వర్క్ ఫ్రం హోం సర్వే నిర్వహిస్తుందన్నారు. సర్వేలో తక్కువ ప్రోగ్రెస్ ఉన్న పంచాయతీలను విజిట్ చేస్తామన్నారు. 18 ఏళ్ల నుంచి 50 సంవత్సరాల లోపు వారు ఇళ్ల వద్ద ఉండి ఈ సర్వేకు సహకరించాలన్నారు. ఈ సర్వేలో వారి విద్యార్హత తెలపడంతో పాటు ప్రభుత్వం కల్పించే ఉపాధి పట్ల వారి ఆసక్తిని తెలపాల న్నారు. అనంతరం సిరిపురం, చెలంచర్ల పంచా యతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు.

● చెత్త సేకరణ పరిశీలన

మండలంలోని గౌరవరం, ఆనెమడుగు, తాళ్లపాలెం పంచాయతీల్లో చెత్త సేకరణకు ప్రభుత్వం ట్రాక్టర్లను అందించింది. గౌరవరంలో ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ పనులను ఈవోపీఆర్డీ అబ్దుల్ సమద్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రాధిక, కార్యదర్శి అఖిల, స్థానిక నాయకుడు చింతం బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రకాశం'లో ప్రేరణ కార్యక్రమం



ప్రేరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీ నటుడు ఎఫ్2 ఫేం ప్రదీప్ సతీమణి సరస్వతి

కందుకూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు, మోటివేటర్ కేవీ ప్రదీప్, ఆయన సతీమణి జేసీ సరస్వతిలు స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం సాయంత్రం విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. పలువురి విజేతల స్ఫూర్తిదాయకమైన కథనాలు, జీవితంలో తీవ్రంగా విఫలమై తమ ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ఉన్నత స్థానాలకు ఎదిగిన పలువురి విజయాలను వివ రిస్తూ ఉత్తేజం నింపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌లు ప్రదీప్, సరస్వతిల ప్రసంగాలు విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని రగిలించిందని, విద్యార్థుల భవితకు దిక్సూచిగా నిలిచే ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్‌ప్రిన్సిపాల్ వి. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం మార్పు



నూతన భవనం ప్రారంభిస్తున్న తపాలా శాఖాధికారి

కలిగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనకొండూరు గ్రామంలోని తపాలా కార్యాలయాన్ని బుధవారం కేసీ కాంప్లెక్స్‌లోని అద్దె భవనంలోకి మార్చినట్లు ఆ శాఖ కావలి డివిజన్ ఏఎస్‌పీ ఆర్.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ కళ్యాణ్ రావు, సర్పంచ్ గొట్టిపాటి భవాని, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ లక్ష్మీనారాయణ, గెనేడి పెంచలనరసింహం, ఖాతాదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కావలిలో 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్'



ప్రభుత్వ వైద్యశాల పక్కన శుభ్రపరిచిన రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణకుమార్

కావలి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కావలి ఏరియా వైద్యశాల పక్కన అపరిశుభ్రంగా యూరినర్స్‌తో కంపుకొడుతున్న రోడ్డును మున్సిపల్ కార్మికులు శుభ్రం చేశారు. ఆప్రాంతమంతా శుభ్రం చేసిన తర్వాత దుర్గంధం రాకుండా బ్లీచింగ్, సున్నం చల్లి ఎవరూ యూరినర్స్ పోయకుండా అందంగా ముగ్గులు వేశారు. అలాగే అంబేడ్కర్ పార్కును కూడా శుభ్రపరచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణకుమార్, ఆయా వార్డుల సచివాలయ వానిటరీ కార్యదర్శులు, వార్డు ఇన్‌చార్జిలు, ఏరియావైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురి పేకాటరాయుళ్ల అరెస్ట్

లింగసముద్రం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి అందించిన సమాచారం మేరకు లింగసముద్రం పంచాయతీ బలిజపాలెం గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం సాయంత్రం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.16,140 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం నారాయణ తెలిపారు.

నేటి నుంచి టెన్త్ 'స్పాట్'

- మూల్యాంకనానికి సర్వం సిద్ధం
- జిల్లాకు 1,92,920 సమాధాన పత్రాలు
- 1,558 మంది సిబ్బంది

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ముగిసిన పదో తరగతి పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి జరగనుంది. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 9వతేదీ వరకు నిరవధికంగా మూల్యాంకనం చేసేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. వివిధ జిల్లాలకు చెందిన 1,92,920 సమాధాన పత్రాలు జిల్లాకు చేరాయి. వీటి మూల్యాంకనానికి విద్యాశాఖ 1,558 మంది సిబ్బందిని నియమించింది. 174 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 1036 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 348 మంది స్పెషల్ అసిస్టెంట్లు 'స్పాట్' విధులు నిర్వహించనున్నారు. అయితే వీరిలో కొందరు వ్యక్తిగత కారణాలతో విధులకు హాజరు కాకపోతుండటంతో వారి వద్ద రాతపూర్వకంగా వివరణ తీసుకుని వారి స్థానంలో మరొకరి నియమించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం జరగనుంది. ఒక్కో ఉపాధ్యాయుడు కనీసం రోజుకు 45 నుంచి 50 జవాబు పత్రాలను మూల్యాకనం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.



మూల్యాంకన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో బాలాజీరావు

సీసీ కెమెరాల ఏర్పాటు...

మూల్యాంకనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. సిబ్బంది పనితీరు పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరేట్‌కు అనుసంధానించారు. ఉపాధ్యాయులు విధులు నిర్వహించకపోయినా, గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నా, ఇతర సమస్యలే మున్నా ఈ కెమెరాల ద్వారా గుర్తించనున్నారు. అలాగే విధుల్లో ఉన్న సమయంలో మొబైల్ ఫోన్లు అనుమతించేది లేదని, ఒకవేళ మొబైల్‌లో మాట్లాడుతూ కనిపిస్తే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. కాగా, మూల్యాంకనం ఏర్పాట్లను డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు పరిశీలించారు.



నెల్లూరు రెండవ డిపో గ్యారేజ్ గేటు వద్ద ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించండి

- డిపోల్లో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ నెల్లూరు రీజియన్‌లోని అన్ని డిపోలలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టీ మురళీ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చెంచయ్య మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని డిపోల్లో రెండు రోజులు నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఇందులో భాగంగా విధుల్లో రెడ్ బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. 1/1019 సర్క్యులర్‌ను కచ్చితంగా అమలు చేయాలని, హయ్యర్ పెన్షన్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లీవ్ ఎన్కాష్ మెంట్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వంగానీ, సంస్థగానీ కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని డిపోల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు
నేటి నుంచి హాల్ టికెట్లు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశ పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లను గురువారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ టీ పద్మజ ఓ ప్రకటనలో తెలిపారు. 2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆ విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు పరీక్ష జరుగుతుందన్నారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 13న ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, ఇంటర్‌లో ప్రవేశానికి అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

ఇప్పుడేం చేద్దాం!
మునిగిపోయాం..



తుమ్మలపెంట రోడ్డులో అక్రమ లేఅవుట్

- కావలిలో ప్లాట్ల కొనుగోలుదారుల లబోదిబో
- అక్రమ లేఅవుట్లలో 128 ఎకరాలు గుర్తించిన అధికారులు
- పరారీలో రియల్టర్లు.. కొనుగోలుదారులకు నోటీసులు
- హద్దు రాళ్లు, రోడ్ల తొలగింపు.. నిర్మాణాలకు అనుమతి నిరాకరణ

కావలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో కావలిలో ఇష్టానుసారంగా వెలసిన లేఅవుట్లలో అక్రమాలు వెలుగు చూడటంతో కొనుగోలుదారులు సతమతం అవుతున్నారు. మామూళ్ల మత్తులో నాడు అక్రమ లేఅవుట్లు, లేఅవుట్లలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు అధికార యంత్రాంగం, పాలకవర్గం ప్రోత్సహించడంతో కావలి నియోజకవర్గంలో వందకిపైగా అక్రమ లేఅవుట్లు వేసి పోటాపోటీగా ప్లాట్లు విక్రయించి దొరికిన కాడికి దోచుకుని జేబులు నింపుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రస్తుతం పాలకవర్గం ఒత్తిడితో అక్రమ లేఅవుట్లపై కొరడా ఝుళిపిస్తున్న అధికార యంత్రాంగం ఎన్నో అక్రమాలను గుర్తించింది. లేఅవుట్ యజమానులు పత్తాలేకుండా పోవడంతో అధికారులకు కొనుగోలుదారులకు నోటీసులు ఇస్తున్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉండగా అక్రమ లేఅవుట్లలో 128 ఎకరాల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలో ఉన్నాయని గుర్తించిన అధికారులు అవి ఎక్కడ ఉన్నాయో ఇంకా పూర్తిగా తేల్చడం గానీ, స్వాధీనం చేసుకోవడం గానీ చేయలేదు.

● 128 ఎకరాల ప్రభుత్వ స్థలం ఎక్కడ?

అక్రమ లేఅవుట్లలో గుంటలు, కాలువలు, వాగులు, వంకలు సుమారు 128 ఎకరాల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి లేఅవుట్లలో కలుపుకుని విక్రయించినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు సర్వే చేసి కొంత స్థలాన్ని గుర్తించి మార్కింగ్ ఇచ్చారు. అయితే దానిని స్వాధీనం చేసుకోలేదు. మిగిలిన స్థలం ఎక్కడుందో ఇంకా పూర్తిగా గుర్తించలేదు. మార్కింగ్ చేసిన స్థలం కూడా ఆ మార్కింగ్ చెదిరి పోవడంతో లేఅవుట్లలో ప్రభుత్వ స్థలం ఎక్కడుందో తెలియక క్రయవిక్రయాలు పూర్తిగా ఆగిపోయాయి. అయితే ఇప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసిన వారు మాత్రం ఈ ప్రభుత్వ స్థలం మన ప్లాట్లలో ఏమైనా ఉందా అనే ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి దానిని స్వాధీనం చేసుకోవటంలో అధికారులు ప్రకటన చేసినప్పుడు ఉన్నంత హంషారు ఆ తర్వాత కనిపించడం లేదు.



అక్రమ లేఅవుట్‌లో హద్దురాళ్లను . ధ్వంసం చేస్తున్న ఎక్స్‌కవేటర్

● నిర్మాణాలకు అనుమతి నిరాకరణ

నాటి పాలకులు, అధికారుల అండతో ఇబ్బడిముబ్బడిగా అక్రమ లేఅవుట్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్రమ లేఅవుట్లపై కొరడా ఝుళిపించారు. లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు దారులకు నోటీసులు ఇచ్చి హద్దు రాళ్లు, రోడ్లను కొంత మేరకు తొలగించారు. అక్రమ లేఅవుట్లపై ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వమని అధికారులు ప్రకటించారు. దీంతో ప్లాట్ల క్రయవిక్రయాలు, నిర్మాణాలు పూర్తిగా ఆగిపోవటంతో ఆ రంగాన్ని నమ్ముకుని వ్యాపార లావాదేవీలు సాగిస్తున్న ఎంతోమంది ఆర్థికంగా దెబ్బతిన్నారు. ప్రభుత్వానికి పన్నుల రూపంలో వివిధ రకాలుగా వచ్చే ఆదాయం తగ్గిపోయింది.

సర్వే చేసి, స్వాధీనం చేసుకుంటాం!

అక్రమ లేఅవుట్లను గుర్తించి వారికి నోటీసులు ఇచ్చాం. వాటిని క్రమబద్ధీకరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటాం. లేఅవుట్లలో ప్రభుత్వ స్థలాలు 128 ఎకరాలు కలుపుకున్నారని తాను బాధ్యతలు తీసుకోక ముందే అధికారులు ప్రకటించారు. వాటిపై సర్వే చేపట్టి ఇప్పటి వరకు 90 ఎకరాలకు మార్కింగ్ చేశాం. త్వరలో వాటిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటాం. మిగతా భూమి కూడా త్వరలో సర్వే చేసి గుర్తించి స్వాధీనం చేసుకుంటాం.

- ఎం. సన్నీవంశీకృష్ణ, ఆర్డీవో, కావలి

తయారీదారులను వదిలేసి మామీద పడతారేం!

- మున్సిపల్ అధికారిని నిలదీసిన వ్యాపారులు
- వాగ్వాదం... కావలి ఎమ్మెల్యే వద్దకు పంచాయితీ

కావలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : 'ప్లాస్టిక్ కవర్లు తయారు చేస్తున్న వారిని వదిలేసి, కిరాణాదుకాణాలపై పడి దౌర్జన్యాలు ఎందుకు చేస్తారు.' అంటూ కావలిలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను వ్యాపారులు నిలదీశారు. ఈ వివాదం చినికిచినికి పెద్దదవడంతో ఈ పంచాయితీ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చెంతకు చేరింది. అసలేం జరిగిందంటే.. నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు పట్టుకునేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్ తన సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి ట్రంకురోడ్డులోని ఏబీసీ ప్రొవిజన్ దుకాణానికి వెళ్లారు. అనుమతులు లేకుండానే శానిటరీ ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో చెప్పులు వేసుకుని దుకాణం లోపలకు వెళుతుండటంతో దుకాణ యజమాని అభ్యంతరం తెలిపారు. దీంతో వారు తనిఖీ చేసే అధికారం తమకు ఉందని దురుసుగా మాట్లాడటంతో అక్కడ వాగ్వివాదం జరిగింది. ఇంతలో కిరణా మర్చంట్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు బలసా ప్రసాద్ అక్కడకు చేరుకుని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడారు. అసలు ప్లాస్టిక్ కవర్లు తయారు చేసే వారిని వదిలి ఇలా కిరాణా దుకాణాలలోకి వచ్చి మీ దౌర్జన్యాలేమిటని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరగటంతో ఇతర వ్యాపారులంతా అక్కడకు చేరుకున్నారు. ప్లాస్టిక్ కవర్ల వ్యాపారాలు చేసే పెద్ద పెద్ద దుకాణాల నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుంటూ కిరాణా దుకాణాలపై పడి వేధించడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. దీంతో వారు తాము ఎక్కడ మామూళ్లు తీసుకున్నామో నిరూపించగలవా అని ఎదురు ప్రశ్నించటంతో వాగ్వాదం తీవ్రస్థాయికి చేరుకుంది. స్థానికులు చొరవ తీసుకుని సర్దుబాటు చేయటంతో సమస్య సర్దుమణిగింది. దీంతో బుధవారం కిరాణా వ్యాపారులు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులను పిలిచి వ్యాపారులను ఇబ్బంది పెట్టకుండా విధులను నిర్వర్తించాలని సూచించినట్లు తెలిసింది.

పీజీ కోర్సులకు వేళాయే..!

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

పొదలకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని 17 వర్సిటీలు, వాటి అనుబంధ పీజీ కళాశాలల్లో ఈ కోర్సుల్లో ఏపీ పీజీసెట్-2025 ద్వారా ప్రవేశాలు కల్పించనుంది. ఈ విద్యా సంవత్సరం తిరుపతిలోని ఎస్వీయూ పీజీ సెట్ నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించింది.

● ప్రవేశ పరీక్ష ఇలా..

పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షకు ఓసీ, బీసీ విద్యార్థులకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 45 శాతం మార్కులు వచ్చి డిగ్రీలో ఉండాలి. ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉంటుంది. 100 ప్రశ్నలకు వంద మార్కులు ఉంటాయి. 90 నిమిషాల్లో సమయం ఇస్తారు. నెగిటివ్ మార్కులు ఉండవు. విశ్వవిద్యాలయాల్లో ఉన్న కోర్సులను మూడు కేటగిరిలుగా విభజించి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. కాగా ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 2 (బుధవారం) నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. జూన్ 9 నుంచి 13 వరకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు.



కలెక్టరేట్ ప్రవేశ ద్వారం ముందు ఆందోళన చేస్తున్న ఫాప్టో నాయకులు

పీఆర్సీ, ఐఆర్‌ను వెంటనే విడుదల చేయాలి

- కలెక్టరేట్ ఎదుట ఫాప్టో నిరసన

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు 12వ పీఆర్సీ, ఐఆర్ 30 శాతాన్ని వెంటనే విడుదల చేయాలని ఫాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సంఘం జిల్లా చైర్మన్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. 11వ పీఆర్సీ గడువు ముగిసి 21 నెలలు పూర్తయినా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయక పోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లలో ఆందోళన నెలకొందన్నారు. ఐదేళ్లుగా కారుణ్య నియామకాలు లేక మరణించిన ఉద్యోగుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. కేంద్రం ప్రకటించే డీఏలకు అనుబంధంగా ఇచ్చే డీఏలు మూడు, ఇప్పటికే ప్రకటించిన 5 డీఏల బకాయిలు కూడా పెండింగ్ ఉన్నాయన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫాప్టో కోచైర్మన్లు మురళీకృష్ణ, మాస ప్రసాద్, భాస్కర్ రెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ వీవీ శేషులు, నరసింహం, హజరత్, పిచ్చిబాబు, నాయకులు ఎన్‌వీ రమణయ్య, సురేంద్ర, మణి సుబ్బు, దశరథరాములు, చలపతిశర్మ పాల్గొన్నారు.

నుడాతో జిల్లా సమగ్రాభివృద్ధి

- మంత్రి నారాయణ



మాట్లాడుతున్న మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నుడాతో జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తు న్నట్లు రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వీసీ సూర్యతేజ, కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావుతో విజయవాడలోని మంత్రి చాంబర్‌లో బుధవారం సమీక్ష జరిపారు. కలెక్టరు ఆనంద్, జేసీ కార్తీక్ టెలీకా న్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ కందుకూరులో ఎంజీ లేఅవుట్లకి ప్రభుత్వ స్థలాలు గుర్తించి వెంటనే నుడాకి అప్పగించాలని ఆదేశించారు. లేఅవుట్ల ద్వారా వచ్చే నిధులతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లోనూ ప్రభుత్వ స్థలాలను గుర్తించి నుడాకి అప్పగించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరు మాట్లా డుతూ ఇప్పటికే కొన్ని ప్రభుత్వ స్థలాలను గుర్తించి నుడాకి సమా చారం ఇచ్చామని, వాటిలో అనువైన స్థలాలను నుడా గుర్తిస్తే వారికి అప్పగిస్తామని చెప్పారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో నుడాని నెంబరు వన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సమా వేశంలో డీటీసీపీ విద్యుల్లత, సీపీవో హిమబిందు పాల్గొన్నారు.

డైట్ అధ్యాపక దరఖాస్తుల్లో మార్పులు

నెల్లూరు(విద్య) : ఎల్లిపాడు డైట్ కళాశాలలో అధ్యాపక ఖాళీల భర్తీకి సంబంధించిన దరఖాస్తుల సమ ర్పణలో స్వల్ప మార్పులు చేసినట్లు డీఈవో డాక్టర్ బాలాజీరావు ఓ ప్రక టనలో పేర్కొన్నారు. డిప్యుటేషన్ పద్ధతిలో అధ్యాపకులుగా పనిచేయా లనుకునే స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు ఈ నెల 10వతేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులో పేర్కొన్న వివరాలతో పాటు నమోదు చేసిన విద్యార్హతలకు సంబంధించిన జెరాక్స్ కాపీలను హెచ్‌ఎంలుగానీ, ఎంఈవోల ద్వారాగానీ ఈనెల 11వతేదీ లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందచేయాలన్నారు.

శభాష్ స్టూడెంట్స్!

- జిల్లాస్థాయి ఎక్స్‌పోలో రెండు ప్రాజెక్టుల ఎంపిక
- విద్యార్థులకు డీఈవో అభినందన

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈఎండీపీ ఆధ్వర్యంలో నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి ఎక్స్‌పో నిర్వహించారు. అతిథిగా హాజరైన డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు మాట్లాడుతూ గతేడాది ఎన్‌జీవోల ఆధ్వర్యంలో విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం పెంచేలా జిల్లాలోని ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని చెప్పారు. ఆ శిక్షణ పూర్తయిన ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. దీంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు తయారు చేసిన ఎనిమిది ప్రాజెక్టులను ప్రస్తుతం ప్రదర్శించినట్లు చెప్పారు. వీటిలో ఒట్టూరు ఏపీఎంఎస్‌కు చెందిన విద్యార్థులు తయారు చేసిన గుర్రపుడెక్క ఆకులను ఎండబెట్టి తయారు చేసిన యోగా మ్యాట్‌కు ప్రథమ బహుమతి, పెదపవని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు రాగి, బెల్లం పిండితో కలిపి తయారు చేసిన కప్పులకు ద్వితీయ స్థానం లభించాయని తెలిపారు. ఆ రెండు పాఠశాలల విద్యార్థులతోపాటు ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులందరినీ అభినందించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈఎండీపీ జోనల్ మేనేజర్ నీలిమ, డీసీఈబీ కార్యదర్శి టీవీ రామ్‌కుమార్, ఆత్మకూరు డిప్యూటీ ఈవో ఎం జానకిరామ్, ప్రధానోపాధ్యాయులు ఏ రాజు, వీ వెంకటేశ్వర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులతో డీఈవో బాలాజీరావు, ఉపాధ్యాయులు

5న జగ్జీవన్‌రామ్ జయంతి

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5న భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 9 గంటలకు వేదాయపాళెంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్ప మాల అలంకరణ, 10 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సభ జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

స్పెషల్ డ్రైవ్‌తో ఈకేవైసీ పూర్తి చేయిస్తాం

- నూతన డీఎస్వో విజయకుమార్



విజయకుమార్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ ప్రక్రియను స్పెషల్ డ్రైవ్ ద్వారా వేగంగా పూర్తి చేయిస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎన్ విజయ్‌కుమార్ చెప్పారు. డీఎస్వోగా ఆయన మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రేషన్ డీలర్ల వద్ద, ఎండీయూ వాహనాల వద్ద, సచివాలయాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా కార్డుదా రులందరికీ ఈకేవైసీ పూర్తి చేయిస్తామని తెలిపారు. సచివాలయాల్లో కొందరు సిబ్బంది తమ వద్ద లాగిన్ లేదని, డీలర్ల వద్దకు వెళ్లాలని చెప్పడం సరికాదన్నారు. సచివాలయాల్లో కచ్చితంగా ఈకేవైసీ జరుగుతుందని చెప్పారు. సచివాలయాల్లో ఈకేవైసీ చేయకపోతే తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెలాఖరు వరకు ఈకేవైసీ చేయించుకోవడానికి గడువు ఉందని తెలిపారు. కాగా, విజయకుమార్ రామాయపట్నం పోర్టుకు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ డీఎస్వోగా బదిలీ అయ్యారు.

వైద్య ఆరోగ్యశాఖ ఏవోగా నిషాంత్

- చిన్న వయసులోనే బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న నిషాంత్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో పరిపాలన అధికారిగా ఎస్‌వీ నిషాంత్ రెడ్డి నియమితులయ్యారు. ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్- 1 పరీక్ష రాసి నేరుగా వైద్య ఆరోగ్యశాఖ ఏవోగా గత నెలలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏవోగా పనిచేసిన వారంతా 50 ఏళ్ల పైబడిన వారేకాగా నిషాంత్ 30 ఏళ్లకే ఆ బాధ్యతలు చేపట్టడం గమనార్హం. పల్నాడు జిల్లాకు చెందిన నిషాంత్ రెడ్డి మొదట బ్యాంకు పరీక్షలు రాసి 2018 నుంచి బ్యాంకు అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్-1లో విజయంతో వైద్య ఆరోగ్యశాఖ పరిపాలన అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

ఐఏబీ సమావేశం
నిర్వహించండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్‌కు ఎమ్మెల్యే సోమిరెడ్డి లేఖ

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండో పంటకు నీటి కేటాయింపులకు సంబంధించి ఐఏబీ సమావేశం నిర్వహించాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం లేఖ రాశారు. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 53.374 టీఎంసీలు, కండలేరులో 48.517 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. ఈ డ్యాంలలో డెడ్ స్టోరేజీ తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు పోను కనీసం 60 టీఎంసీలకు పైగా జలాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతుల కోరిక మేరకు రెండో పంటకు నీటి కేటాయింపులకు సంబంధించి ఐఏబీ నిర్వహణకు చర్యలు తీసుకో వాలని మంత్రిని కోరారు. అలాగే కలెక్టర్ ఆనంద్‌కు కూడా లేఖ ప్రతిని పంపారు.



నిత్యాన్నదానానికి విరాళం

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): మండలం లోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలోని జరిగే నిత్యాన్నదానానికి బుధవారం నెల్లూరుకి చెందిన సుధాకర్‌రెడ్డి- స్వప్న దంపతులు రూ.60వేల విరాళాన్ని ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారి గోత్ర నామాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8765
వెండి కిలో ధర	రూ. 1,02,600
వెండి ఒక గ్రాము	రూ.105.60

ఆక్రమణల తొలగింపులో మీనమేషాలు

● ఎల్లేటి కాలువను సర్వే చేసి, వదిలేసిన అధికారులు ● అనుమతి లేకుండా వైసీపీ నేత పూడికతీత

విడవలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లేటి కాలువ ఆక్రమణల తొలగింపులో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సర్వే చేసి, అక్రమణదారులకు నోటీసులు జారీ ఇవ్వకుండా కాలం గడుపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో విడవలూరుకి చెందిన ఓ వైసీపీ నేత తన చేపల గుంతల్లోని నీరు పోయేందుకు అనుమతి లేకుండా కాలువ పూడికతీత చేపట్టారు. దీంతో రైతులు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా సదరు వైసీపీ నేత పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

● సర్వే చేసి వదిలేశారు...

ముదివర్తి గ్రామరెవెన్యూ పరిధిలోని మన్మథరావుపేట, చెలికల మధ్యలో సుమారు కిలోమీటరు దూరం ఎల్లేటి కాలువ ఉంది. సుమారు 300 ఎకరాల రైతులకు వర్షపు నీరు, పులక నీరు పోయేందుకు ఈ కాలువ ఉపయోగకరంగా ఉంది. ఈ కాలువను మాజీ సీఎం జగన్‌రెడ్డి సమీప బంధువైన ఓ వైసీపీ నేతతోపాటు మరికొందరు రైతులు ఆక్రమించారు. కాలువను పూడ్చి వేసి గట్లపై రేకుల షెడ్డు నిర్మించారు. దీంతో కాలువ కుంచించుకుని పోయి, పులక నీరు, వర్షపునీరు బయటకు వెళ్లక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై గత జనవరి 8న ఆంధ్రజ్యోతిలో 'ఎల్లేటి కాలువ కబ్జా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లాధికారులు స్పందించారు. కాలువ ఆక్రమణలపై సర్వే నిర్వహించి, నివేదికలను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో నెల క్రితం ఆక్రమణలపై సర్వే నిర్వహించారు. అయితే తొలగింపు ప్రక్రియ అటకెక్కింది. ఇదిలా ఉంటే వైసీపీ నేత తన చేపల గుంతలోకి నీరు పోయేందుకు వీలుగా ఎలాంటి అనుమతి లేకుండా పూడికతీత చేపట్టాడు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయారు.



అనుమతి లేకుండా వైసీపీ నేత తవ్విన ఎల్లేటి కాలువ

జిల్లాధికారులు స్పందించాలి

ఎల్లేటి కాలువలో ఆక్రమణలు తొలగించాలని పలుమార్లు అధికారులకు తెలిపాం. సర్వే చేశారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా కలెక్టరు, కోవూరు ఎమ్మెల్యే స్పందించి రైతులకు న్యాయం చేయాలి. లేకుంటే ఆందోళన చేయాల్సి వస్తుంది.



\- దేవళ్ల శివకోటారెడ్డి, రైతు


ఎల్లేటి కాలువ
కబ్జా!

జనవరి 8న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

రెవెన్యూ అధికారులకు తెలిపాం

ఎల్లేటి కాలువ ఆక్రమణలపై నోటీసులు జారీ చేయాలని రెవెన్యూ అధికారులకు తెలిపాం. త్వరలోనే ఆక్రమణలను తొలగిస్తాం.

\- శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ

న్యూస్ బాక్స్

నిధులు దుర్వినియోగం చేసిన వారిని సస్పెండ్ చేయాలి

● ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న గద్దల మునెయ్య, తదితరులు

రాపూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగు నిధులను దుర్వినియోగం చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య డిమాండ్ చేశారు. రాపూరు మద్దెలమడుగు సెంటర్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాపూరు వెలుగు కార్యాలయంలో జరిగిన అవకతవకలపై ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించగా స్పందించిన కలెక్టర్ తొమ్మిది మంది డిఆర్‌డిఏ సిబ్బందితో విచారణకు ఆదేశించారు. దాదాపు అయిదు నెలల పాటు మండల వ్యాప్తంగా రూ. 1.41 కోట్ల అవినీతి, అక్రమాలు జరిగినట్లు డిఆర్‌డిఏ పిడి తెలిపారు. అందువలన కలెక్టర్ వెంటనే స్పందించి నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో విజయవాడ సెర్ప్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిత్వం భావితరాలకు ఆదర్శం



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నేటితరం పాఠకులకు అర్థమయ్యేలా చిన్న చిన్న పదాలతో గొప్ప అర్థాన్నిస్తూ రాసిన కవిత్వాలు భావితరాలకు సైతం ఎంతో ఆదర్శనీయమని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో బుధవారం రాజనీతి శాస్త్ర ఆచార్యులు, కవి కాంజీవరం రాధాకృష్ణ రాసిన 'మారకనే మారానంటాడు' అనే కవితా సంపుటిని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సామాజికతను కవితారూపంలో ఉంచిన ఈ కవిత్వం అందరిని చదివిస్తుందని, సమాజానికి యథార్థ ప్రతిబింబంగా ఉందన్నారు. ఈసందర్భంగా రాధాకృష్ణ తన కవితా సంపుటిలోని కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, తెలుగు శాఖ ప్రొఫెసర్లు డాక్టర్ సీ రాజారామ్, డాక్టర్ కే లక్ష్మీనారాయణరెడ్డి, డాక్టర్ వీ. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమావేశం



శివాలయం వద్ద సమావేశమైన గ్రామస్థులు

మనుబోలు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీ సంగమేశ్వర బ్రహోత్సవాల నిర్వహణపై స్థానిక శివాలయం వద్ద బుధవారం చర్చించారు. ప్రతిఏటా ఏప్రిల్ 9నుంచి 17వరకు మనుబోలులో సంగమేశ్వర బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో గ్రామస్థులంతా ఏకమై ఆలయం వద్ద కూర్చుని చర్చించుకున్నారు. ఏరోజు ఏ కార్యక్రమం నిర్వహించాలి, ఎలాంటి ఏర్పాట్లు చేయాలి, రథోత్సవం, కల్యాణం రోజున అన్ని సామాజికవర్గాలు ఐకమత్యంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్చించారు. ఆనవాయితీ ప్రకారం ఉత్సవాలను సక్రమంగా నిర్వహించేందుకు అందరూ సహకరించేలా తీర్మానించారు. ఉత్సవాలకు చందాల సేకరణలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని నిర్ణయించారు. ఈ బ్రహోత్సవాలకు ఒక్క మనుబోలే కాకుండా, మండలం, జిల్లా నలుమూలల నుంచి, ఇతర రాష్ట్రాలు, జిల్లాలో స్థిరపడిన వారంతా వస్తారని, కావున ఉత్సవాలను జయప్రదం చేసేలా గ్రామస్థులంతా నిర్ణయం తీసుకున్నారు.

తపాలా కార్యాలయం మార్పు

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనకొండూరులోని తపాలా కార్యాలయాన్ని బుధవారం కేసీ కాంప్లెక్స్‌లోని అద్దె భవనంలోకి మార్చినట్లు ఆ శాఖ కావలి డివిజన్ ఏఎస్‌పీ ఆర్.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ కళ్యాణ్‌రావు, సర్పంచి భవాని పాల్గొన్నారు.

త్వరలో ఫిషింగ్ జెట్టీ నిర్మాణం పూర్తి

● మరో దాని నిర్మాణం కోసం ప్రతిపాదనలు

● సర్వేపల్లిఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ముత్తుకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నేలటూరు ఫిషింగ్ జెట్టీ నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేయిస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ జెట్టీని అదానీ కృష్ణపట్నం పోర్టు ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జెట్టీ నిర్మాణం పూర్తి కావడానికి మరో రూ.15కోట్లు అవసరమవుతుందని, ఈ మొత్తాన్ని ఏపీ మారిటైం బోర్డు భరిస్తుందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న జెట్టీ ఒక్క నేలటూరు పంచాయతీ మత్స్యకారులకు మాత్రమే ఉపయోగపడుతుందని, చిల్లకూరు, వాకాడు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల మత్స్యకారులతోపాటు కొడవలూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన మత్స్యకారులకు ఉపయోగపడేలా మరో జెట్టీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ముత్తుకూరును దత్తత తీసుకున్న అదానీ కృష్ణపట్నం పోర్టుకి అభినందనలు తెలిపారు. ఎస్ఈఐఎల్ కంపెనీ సర్వేపల్లి నియోజకవర్గంలోని ఆసుపత్రులకు రూ.1.30కోట్ల సీఎస్ఆర్ నిధులతో వివిధ పరికరాలను ఆరోగ్య కేంద్రాలకు అప్పగించనున్నదని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, నీలం మల్లికార్జునయాదవ్, మత్స్యకార నాయకులు వావిళ్ల జనార్దన్, ఏడుకొండలు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సోము వీర్రాజుకు అభినందన



సోము వీర్రాజును అభినందిస్తున్న కైలాసం శ్రీనివాసులు, తదితరులు

ఇందుకూరుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వెలగపూడి సచివాలయంలో బుధవారం ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన బీజేపీ నేత సోము వీర్రాజును ఇందుకూరుపేట మండల బీజేపీ అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కరణం భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ చేయాలి



కోవూరులో రాస్తారోకో చేస్తున్న క్రైస్తవ సంఘాలు

కోవూరు, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై న్యాయవిచారణ జరపాలని మండల పరిధిలోని క్రైస్తవ సంఘాలు బుధవారం పట్టణంలో ప్రదర్శన చేపట్టాయి. శారాబిలాక్ చర్చి నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన తాలూకాఫీసు కూడలి, మందబయలు కూడలి మీదుగా బజారు కూడలి వరకు సాగింది. అనంతరం బజారుకూడలిలో రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో క్రైస్తవ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రం హోం సర్వే పూర్తి చేయాలి

కావలి రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సైతం స్త్రీ, పురుషులకు ఇంటి వద్దే ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్పీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. కావలి మండలంలోని అన్నగారిపాలెం, పెదపట్టపుపాలెం, రుద్రకోట, సిరిపురం, చలంచర్ల గ్రామ సచివాలయాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇంటి వద్దే ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వర్క్ ఫ్రం హోం సర్వే నిర్వహిస్తుందన్నారు. సర్వేలో తక్కువ ప్రోగ్రెస్ ఉన్న పంచాయతీలను విజిట్ చేస్తామన్నారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు వారు ఇళ్ల వద్ద ఉండి ఈ సర్వేకు సహకరించాలన్నారు. ఈ సర్వేలో వారి విద్యార్హత తెలపడంతో పాటు ప్రభుత్వం కల్పించే ఉపాధి పట్ల వారి ఆసక్తిని తెలపాలన్నారు. అనంతరం సిరిపురం, చెలంచర్ల పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు.

గుంతలుమిట్టలుగా కోడూరు బీచ్ రోడ్డు

● గత పాలకుల వల్లే ఈ దుస్థితి



గుంతలమయంగా ఉన్న కోడూరు బీచ్ రోడ్డు

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు బీచ్‌కి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి గుంతలమయంగా ఉంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. గత ప్రభుత్వం వైఖరి వల్లే ఈ దుస్థితి దాపురించిందని స్థానికులు వాపోతున్నారు. ఈ మార్గంలోనే పలు హేచరీలు, పశుగ్రాసం తయారీ కర్మాగారాలు ఉన్నాయి. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటాయి. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో కోడూరు బీచ్‌కు సందర్శకులు, పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ క్రమంలో ఈ మార్గంలో గుంతలు ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. బీచ్‌కు రోడ్డు నిర్మాణం చేపడతానని చెప్పిన గత వైసీపీ పాలకుల మాటలు నీటిమూటల య్యాయి. వర్షాకాలం ప్రయాణికులు ఈ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రోడ్డుపై దృష్టి పెట్టాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రాపూరులో పడకేసిన పారిశుధ్యం



రామాలయం ఎదురుగా పేరుకుపోయిన చెత్త

రాపూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. శివాలయం వీధిలో చెత్త పేరుకపోయింది. శివాలయం, రామాలయం, సాయిబాబా మందిరం, రాపూరమ్మ దేవాలయానికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్గంధం వెదజల్లుతుండడంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, ఆ చెత్తకుప్పలో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త కుప్పను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో సమస్యలు తెలుపుతున్న అన్నారెడ్డిపాళెం ఎంపీటీసీ మోహన్

విడవలూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ ఏకుల శేషమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్నారెడ్డిపాళెం ఎంపీటీసీ కుడుముల మోహన్ మాట్లాడుతూ పంచాయతీలోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు అక్రమించుకుని కట్టడాలు కడుతున్నారని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఎంపీటీసీ మాటకే విలువ లేకపోతే ఈ పదవులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఇందుకు తహసీల్దారు చంద్రశేఖర్ సమాధానమిస్తూ సమస్య పుర్వాపరాలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో నగేష్‌కుమారి మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా బోర్లు, మోటార్లను మరమ్మతులు చేయించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టికి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ ఆవుల శ్రీనివాసులు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, టీడీపీ నాయకుడు పాశం శ్రీహరిరెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

239 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 296 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొని 239 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-37, ఆర్ఆర్-2, సీఆర్-14, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 576 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.235, సగటు ధర రూ.272.35గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

విష గుళికలు మింగి యువకుడి మృతి

వెంకటాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరామపురంలో ఓ వ్యక్తి విష గుళికలు మింగి బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు, గ్రామానికి చెందిన బీరుదోలు హరిబాబు(36) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. సమస్యలు తీవ్రం కావడంతో విష గుళికలు మింగాడు. దీంతో ఆయన మృతి చెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామదాసుకండ్రిగ సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. సైదాపురానికి చెందిన రామయ్య, అశోక్ మోటార్ బైక్‌పై ముత్తుకూరులోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో నాయుడుపాళెం క్రాస్ రోడ్డు దాటాక రోడ్డు మలుపు రావడంతో ఆ ప్రాంతంలో కంకర రాళ్లు ఉండడం వల్ల బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో వారిద్దరూ గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిర్యానీ సెంటర్‌పై దాడి

● చంపేస్తామని నిర్వాహకులకు బెదిరింపు



దుండగులు ధ్వంసం చేసిన బిర్యానీ సెంటర్

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): కొందరు గుర్తు తెలియని యువకులు బుధవారం బుచ్చి బైపాస్ రోడ్డులోని ఓ బిర్యానీ సెంటర్‌ను ధ్వంసం చేశారు. యజమానులపై దాడి చేసి, చంపేస్తామంటూ బెదిరించారు. బాధితుల కథనం మేరకు, బుచ్చి పల్లిపాళేనికి చెందిన గిరిజనుడు యాటగిరి గోపి, దామరమడుగు మతంకాలనీకి చెందిన ముస్లిం యువతి షేక్ బీబీజాన్‌లు 11 ఏళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం బుచ్చి బైపాస్‌రోడ్డులో బిర్యానీ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రారంభించిన కొంతసేపటికి ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఈ సెంటర్‌ను ధ్వంసం చేశారు. అంతేకాక మిమ్మల్ని చంపేస్తామంటూ భార్యాభర్తలపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మంటల్లో చిక్కుకొని లారీల దగ్ధం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఆటోనగర్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో వ్యర్థాలు తగలబడటంతో పక్కనే ఉన్న లారీలు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.... సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో ఓ రోడ్డుపక్కన పెద్ద ఎత్తున చెత్తచెదారులు వేసి ఉన్నాయి. దాని పక్కనే లారీలు నిలిచి ఉన్నాయి. ప్రమాదవశాత్తు జరిగిందో లేక ఎవరైనా అగ్గి రాజేశారో తెలియదుగానీ చెత్తమండటం ప్రారంభమైంది. ఆ నిప్పు కాస్తా పక్కనే ఉన్న లారీలకు అంటుకుంది. మంటలు ఉవ్వెత్తున ఎగిపడుతుండటం గమనించి స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. అగ్నికి దగ్ధమైన లారీలు ఎవరివన్న సమాచారం లేదు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడు(60) మృతి చెందాడు. ఈ ఘటనపై దర్గామిట్ట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... జీజీహెచ్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు అక్కడికి చేరుకొని వివరాల గురించి ఆరాతీశారు. తన గ్రామం కసుమూరు అని ఆ వృద్ధుడు చెబుతూ ఉండేవాడని కొందరు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440700018 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

కలెక్టరేట్‌లో మరుగుదొడ్లకు తాళం


● సందర్శకులకు అవస్థలు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ప్రాంగణంలో వందలాది మంది వినియోగించుకుంటున్న నగర పాలక సంస్థ మరుగుదొడ్లకు తాళం పడింది. ఈ మరుగు దొడ్ల పర్యవేక్షణ చూసే ఒక మహిళకు రెండు నెలలుగా జీతం ఇవ్వకపోవడంతో ఆమె ఆ మరుగు దొడ్లకు తాళం వేసి వెళ్లినట్లు సమాచారం. కలెక్టరేట్‌కు నిత్యం వందల మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. వారు ఆ మరుగుదొడ్లను విని యోగించుకుంటుంటారు. అయితే రెండు రోజులుగా తాళం వేయడంతో అత్యవ సరమైన వారు ఇబ్బంది పడుతున్నారు. మూతపడిన మరుగుదొడ్లను తెరిపించాలని కోరుతున్నారు.



కలెక్టరేట్ ప్రాంగణంలో తాళం వేసి ఉన్న నగర పాలక సంస్థ పబ్లిక్ టాయిలెట్లు

ఇది నిజమేనా...?



ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉదయగిరి 4 కిలోమీటర్లని జాతీయ రహదారి అధికారులు మైలురాయి ఏర్పాటు చేశారు. కాగా, విద్యుత్ సబ్‌స్టేషన్, గండిపాళెం మార్గంలో ఏర్పాటుచేసిన సర్కిల్ వద్ద నుంచి ఉదయగిరి సుమారు 1.5 నుంచి 2.5 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. అయితే మైలురాయిపై 4 కిలోమీటర్లని నమోదు చేశారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే కొత్త వ్యక్తులు ఈ మైలురాయిని చూసి అయోమయానికి గురవుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	248
స్కిన్‌లెస్	274

కోడిగుడ్ల ధర (100): 450



రోడ్డు, కాలువలు నిర్మించండి సారూ...!

● రూరల్ ఎమ్మెల్యేని కోరిన తల్పగిరికాలనీ వాసులు

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : తమ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని బుజబుజ నెల్లూరు సమీపంలోని తల్పగిరి కాలనీ వాసులు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిని వేడుకున్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యేకు ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. గడిచిన 20 ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివాసాలుంటున్నా రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ తల్పగిరి కాలనీలో రోడ్డు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని కార్పొరేషన్ అధికారులను ఫోన్లో ఆదేశించారు.

న్యూస్ బాక్స్

ఏపీలో రైల్వేల అభివృద్ధికి చర్యలేమిటి?

● లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందో వివరించాలని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బుధవారం లోక్‌సభలో ప్రశ్నించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ సమాధానమిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 2024 ఏప్రిల్ 1 నాటికి మొత్తం 5,329 కి.మీ పొడవున రూ.73.743 కోట్ల విలువైన 41 రైల్వే ప్రాజెక్టులు అమల్లో ఉన్నాయన్నారు. వీటిల్లో 1006 కి.మీల పొడవున రూ.24,150 కోట్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు.

రంజాన్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అవాజ్ కమిటీ రూపొందించిన రంజాన్ ప్రత్యేక సంచిక పుస్తకాన్ని నగరంలోని ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో బుధవారం నెల్లూరు నగర ఎంఈవో అబ్దుల్ హమీద్ ఆవిష్కరించారు. ప్రజల్లో లౌకికత్వం, ఐక్యతకు చిహ్నంగా ఎన్నో పుస్తకా విష్కరణలు జరుగుతున్నాయని. ఇలాంటి సంచికలు ప్రజల్లో మంచి ఆలోచనలను రేకెత్తిస్తాయని చెప్పారు. అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి రషీద్ మాట్లాడుతూ అవాజ్ కమిటీ లౌకికత్వ సూత్రాలకు కట్టుబడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బుక్‌హౌస్ ఇన్‌చార్జి అరుణ, అవాజ్ కమిటీ సభ్యులు షేక్ రియాజ్, అహ్మద్, ఫయాజ్, షబ్బీర్ బాషా, మాల కొండేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

రెండు చోట్ల చోరీలు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 2, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలో రెండు ప్రాంతాల్లో చోరీలు జరిగినట్లు సీఐ గుంజి వేణు బుధవారం తెలిపారు. కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో భాస్కర్ అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు రెండు గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నారాయణ మెడికల్ కళాశాలలోని డాక్టర్స్ క్వార్టర్స్‌లో డాక్టర్ మంజు ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు సుమారు రూ.1.50 లక్షల విలువచేసేవి అపహరణకు గురైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పాలిసెట్ ఎంట్రెన్స్‌కు శిక్షణ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు 2025-26 విద్యా సంవత్సరానికి నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణతోపాటు ఉచితంగా పుస్తకా లు అందచేస్తామని చెప్పారు. ఈనెల 15వతేదీ వరకు పాలిసెట్ దరఖాస్తుకు అవకాశం ఉందని, టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

6న శ్రీరామనవమి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్‌లో ఈ నెల 6న శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మందిరం చైర్మన్ మధుసాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం సీతారామ కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. సాయంత్రం సాయినాథుని దివ్య రథోత్సవం వైభవంగా జరుగుతుందని తెలిపారు.

ధర్మస్థాపనకే కృష్ణావతారం

● అవధాని కోట రాజశేఖర్

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : దుర్జనులను శిక్షించి సజ్జనులను రక్షించి ధర్మస్థాపన చేయడం కోసమే మహావిష్ణువు శ్రీకృష్ణుడిగా అవతరించారని అవధాని కోట రాజశేఖర్ తెలిపారు. నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన శ్రీకృష్ణ అవతారంపై ప్రవచనం చేశారు. శ్రీకృష్ణుడు కంసుడి లాంటి దుష్టులందరినీ హతమార్చి భూభారం తగ్గించాడని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయంలో ద్రౌపది అమ్మవారికి అర్చన, గణపతి హోమం, ప్రసాద వితరణ జరిగాయి. ఉభయదాతలుగా దువ్వూరు నాగార్జున కుటుంబం, చక్రాల వెంకట లక్ష్మీనరసింహం, నాగరత్న కుమారీ వ్యవహరించారు. కంచి జ్ఞానేంద్ర, సాదా నాగేంద్రకుమార్, వేలూరు నారాయణస్వామి, సమయానంద స్వామి, లక్ష్మీనరసింహారావు తదితరులు పర్యవేక్షించారు.

పానీయాలే కాపాడుతాయ్!



● వేసవిలో జాగ్రత్తలు అవసరం
● పండ్ల రసాలతో ఆరోగ్యం

వేసవి వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు 39 నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. భానుడి భగభగతో జనాలు అల్లాతున్నారు. కాసేపు బయటకు వెళ్లి వస్తేనే విపరీతమైన నీరసం... ఒంట్లోని శక్తినంతా ఎవరో లాగేసిన ఫీలింగ్. తీవ్రమైన డీహైడ్రేషన్‌తో ఆసుపత్రికి పాలయ్యేవారు ఎంతో మంది. ఇలాంటి పరిస్థితుల్లో వేసవి నుంచి ఉపశమనం పొందాలన్నా, ఈ సమ్మర్ నుంచి సేఫ్ గట్టెక్కాలంటే ప్రత్యామ్నాయ ఆహారం వైపు దృష్టిపెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, పానీయాల వంటి ద్రవాహారం ఎంతో మేలని చెబుతున్నారు.

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం అంటే ఎండలు మాత్రమే కాదు. వాటితో పాటు వచ్చే ఎన్నో వ్యాధులు కూడా మనల్ని ఇబ్బంది పెడతాయి. వడగాడ్పులు, డీహైడ్రేషన్, వడదెబ్బ, చెమట కారడం, నీటి కాలుష్యం వల్ల వచ్చే డయేరియా, వైరల్ జ్వరాలు.... ఇలాంటివి ఎన్నో!. అయితే కాస్త ముందుచూపుతో వ్యవహరిస్తే ఈ సమస్యను తప్పించుకోవచ్చని, ప్రత్యేకించి జీవన శైలిని, ఆహార నియమాలను మార్చుకొంటే మండే ఎండల్లోనూ హాయిగా, ఆరోగ్యంగా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా నీటిని ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

● శాకాహారమే ఉత్తమం

మండే ఎండల్లో దేహానికి చల్లదనాన్ని ఇచ్చే ఆహార పదార్థాలు తీసుకోవడం మంచిది. పరిశుభ్రమైన శాకాహారాన్నే ఎక్కువగా తీసుకోవాలి. మాంసాహారానికి వీలైనంత దూరంగా ఉండాలి. శాకాహారంలో కూడా మసాలాలు ఎక్కువగా వాడరాదు. వేపుళ్లు అంతా మంచికాదు. నూనె వాడకాన్ని బాగా తగ్గించాలి. తేలికగా జీర్ణమయే ఆహారం తీసుకోవడం ఉత్తమం. చల్లని మజ్జిగ, పెరుగు, లస్సీ తాగాలి. వివిధ రకాల పండ్లను కలిపి తీసుకుంటే చాలా మంచిది. కీరదోసకాయలు ఎక్కువగా తినాలి. పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే వాటిని తీసుకోవాలి. నిమ్మరసం తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఐస్ క్రీములను వీలైనంత వరకు తక్కువగా తీసుకోవాలి.

● కొబ్బరి నీళ్లు - చెరుకు రసం

కొబ్బరి నీళ్లను ఎక్కువగా తాగాలి. ఇవి శరీరాన్ని చల్లబరచడమేకాక తక్షణ శక్తినిస్తాయి. మూత్రవిసర్జన సాఫీగా జరిగి కిడ్నీలకు సంబంధించిన వ్యాధులు దరిచేరవు. సోడియం, పొటాషియం సరైన శాతంలో ఉండడం వల్ల విరేచనాలు, వాంతులు, నీరసం నుంచి ఉపసమనం లభిస్తుంది. ఒక గ్లాస్ కొబ్బరి నీళ్లు ఒక సెలైన్ బాటిల్‌తో సమానం అని వైద్యులు చెబుతున్నారు. వేసవి తాపం నుంచి శరీరాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కొబ్బరినీళ్లతోపాటు చెరుకు రసాన్ని కూడా బాగా తీసుకోవాలి.

● తాటి ముంజెలు

వేసవి సీజన్ వేడినే కాదు ప్రకృతి సహజమైన కొత్త రుచులను కూడా అందిస్తుంది. అందులో ముఖ్యమైనవి తాటిముంజెలు. వీటిని ఐస్ ఆపిల్స్‌గా పిలుస్తారు. ఈ ముంజలు శరీరానికి ఎంతో చలువ చేస్తాయి. వీటిలో క్యాలరీలు, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఆరు అరటి పండ్లలో ఉండే పొటాషియం ఒక తాటి ముంజెలో ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచి, కాలేయ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. ట్యూమర్లు, బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేసే పెట్రో కెమికల్స్, ఆంథోసైనిన్ వంటి వాటిని నిర్మూలిస్తాయి.

● పచ్చిమామిడితో తాపానికి చెక్

వేసవి తాపానికి, వడదెబ్బకు గురైనవారు పచ్చిమామిడి కాయను తరిగి ఒక గ్లాస్‌నీటిలో వేసి దానిలో చక్కెర బాగావేసి కలపాలి. ఇలా తయారు చేసుకున్న దానిని తాగితే వడదెబ్బ నుంచి బయటపడతారు. పచ్చిమామిడికాయ ముక్కలపై కాస్త ఉప్పు వేసి తింటే దాహార్తిని తగ్గిస్తుంది. చెమట ద్వారా శరీరంలోని లవణాలు, రక్తంలోని ఐరన్ వంటి బయటకు పోకుండా ఆపుతుంది. గుండె కండరాలను బిగుతుగా చేసే శక్తి మామిడికి ఉంది. చర్మాన్ని కూడా మిలమిల మెరిసేలా చేస్తుంది.

పండ్ల రసాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పండ్లరసాలు అధికంగా తీసుకోవడం వల్ల వేసవి తాపం నుంచి ఉపశమనం పొందవచ్చు. వయసుతో నిమిత్తం లేకుండా అందరూ పండ్ల రసాలు ఎక్కువగా తీసుకుంటే మంచిది. ప్రత్యేకించి చెరకు రసం, తాటి ముంజలు, కొబ్బరి బోండాలు తీసుకోవాలి. మసాలాలు, మాంసాహారాన్ని బాగా తగ్గించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

- డాక్టర్ కాలేషాబాషా, జీజీహెచ్ ప్రొఫెసర్

శబరి శ్రీరామక్షేత్రంలో నవరాత్రి వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో వసంత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం స్వామివార్లకు బెల్లంపానకం, కొబ్బ రినీళ్లతో అభిషేకాలు జరిగాయి. ఉదయం, సాయంత్రం స్వామివార్లకు గన్నేరు, కలువ పూలతో అర్చనలు చేశారు. జమ్మి, మర్రి సమిధలతో హోమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు చెన్నూరు వెంకటేశ్వర రెడ్డి, చంద్ర రెడ్డి, రాజు, అర్చకుడు నరేష్ పర్యవేక్షించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

లింగసముద్రం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రం పంచాయతీ బలిజపాలెం గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం సాయంత్రం దాడులు చేశారు. పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి రూ.16,140 స్వాధీనం చేసుకున్నారు.

ఐటీ ఉద్యోగాలకు 'జెనెక్స్' విద్యార్థులు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జెనెక్స్ కళాశాల విద్యార్థులు పలువురు ఐటీ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆ విద్యాసంస్థ చైర్మన్ వెంగళ్‌రెడ్డి, డైరెక్టర్ కొండలరావు తెలిపారు. నగరంలోని జెనెక్స్ కళాశాలలో బుధవారం చెన్నైకి చెందిన ప్రముఖ ఐటీ సంస్థ ఆల్ట్రాస్ టెక్నాలజీస్ క్యాంపస్ డ్రైవ్ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ డ్రైవ్‌కు వంద మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా వారికి ఇంటర్వ్యూలు, అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించి 45 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీతేజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్, ప్లేస్‌మెంట్ హెడ్ శ్రీచరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న పీడీ వేణుగోపాల్

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ సంస్థ జేఏసీ ఎగ్జిక్యూటివ్ డైరీని హౌసింగ్ శాఖ పీడీ వేణుగోపాల్ ఆవిష్కరించారు. కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు నూతన తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకుని నూతన డైరీని అవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, కావలి డీఈలు మోహన్‌రావు, మాధవరావు, జేఏసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మనోజ్‌కుమార్, ఆవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ వీ కృష్ణ, జిల్లా అవుట్ సోర్సింగ్ సంఘం గౌరవ అధ్యక్షుడు మంజునాథ్ పాల్గొన్నారు.

ఎక్కడున్నావ్.. కాకాణీ?

● వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్

నెల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : 'ఎక్కడున్నావ్.. కాకాణీ..? పోలీసులకు దొరక్కుండా ఎన్ని రోజులు దాక్కుంటావ్..? తప్పు చేయడం, ఆ తర్వాత పరారవడం నీకు అలవాటేనా..?' అంటూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్, టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పొదలకూరు మండలంలోని రుస్తుం మైన్స్ వేదికగా చేసిన పాపాలు శాపాలుగా కాకాణిని వెంటాడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఇప్పటికి మూడు సార్లు నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు వెళితే పత్తా లేకుండా పరారయ్యారని విమర్శించారు. 2016లో కూడా సోమిరెడ్డిపై ఆరోపణలు చేశారని, దీనిపై సోమిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాక కాకాణి రెండు నెలలు కనిపించకుండా పోయారని దుయ్యబట్టారు. ఎన్ని జిమ్మిక్కులు ప్రదర్శించినా చేసిన తప్పులకు శిక్ష అనుభవించక తప్పదని వ్యాఖ్యానించారు.

ఆటిజానికి మందుల్లేవు

సైక్రియాటిస్ట్ డాక్టర్ పీవీ రెడ్డి



డాక్టర్ పీవీ రెడ్డితో రెడ్‌క్రాస్ కమిటీ, ఎడ్యుకేటర్లు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆటిజం వ్యాధి కాదని అది న్యూరోలాజికల్ డిజార్డర్ అని, దీనికి మందుల్లేవని ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ పీవీ రెడ్డి వెల్లడించారు. బుధవారం ఆటిజం దినోత్సవం సందర్భంగా నగరంలోని రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ మైల్డ్ ఆటిజం, మోడరేట్ ఆటిజం, సివియర్ ఆటిజం అనే మూడు రకాలుగా ఇది ఉంటుందన్నారు. ఫిజియోథెరపీ ద్వారా మాత్రమే ఆటిజం చిన్నారులకు వారి ప్రవర్తనలో మార్పు తీసుకురాగలమని చెప్పారు. ఆటిజం చిన్నారుల ఆహారం, ఆరోగ్యం విషయంలో పలు అంశాలను వారి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్, దివ్యాంగుల కేంద్రం ప్రిన్సిపాల్ గురునాథ రావు, స్పెషల్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దుతాం

● నగర కమిషనర్ సూర్యతేజ



పార్కులో పాడైన ట్విన్ బిన్నులను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 2, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆదిత్యనగర్ చిల్డ్రన్స్ పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. బుధవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన పార్కును పరిశీలించారు. సందర్శకులకు మెరుగైన సౌకర్యా లు కల్పించాలని అధికారులకు సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, డస్ట్ బిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. చిన్నారులకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని, ఫౌంటెయిన్లకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. మహిళలకు జిమ్, యోగా, ఇతర సౌకర్యాలను కూడా త్వరలో కల్పిస్తామని చెప్పారు. కాగా, బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తులను నిషేధించాలని పిలుపునిస్తూ రూపొందించిన పోస్టర్లను కార్పొరేషన్ కార్యాలయంలో ఏడీసీ నందన్, ఎంహెచ్‌వో చైతన్య విడుదల చేశారు.

విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి


● ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు



పుస్తకాలు అందుకున్న విద్యార్థినిలతో ఆర్ఐఓ, సిబ్బంది

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యలో వచ్చిన నూతన మార్పులకు అనుగుణంగా విద్యార్థులు అవకాశా లను అందిపుచ్చు కుని ఎదగాలని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు సూచించారు. నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధ వారం ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలను ఆయన అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమా న్యంలో ఉన్న జూనియర్ కళాశాలలు, మోడల్ కాలేజీలు, కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్‌లలో చదువుతున్న విద్యార్థినులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద ఉచితంగా పుస్తకాలను అందచేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల సంక్షేమం కోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం వంటి పథకాల ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను అందరూ సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, అధ్యా పకులు చంద్రకళ, వెంకట్రావు, శ్రీదేవి, సమత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడాకారులకు అభినందన




విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ త్రోబాల్ పోటీల్లో మూలాపేట నగర పాలక ఉన్నత పాఠశాల (రామయ్యబడి) 9వ తరగతి వి ద్యార్థులు పీ సుశాంత్ కిరణ్, పీ దుర్గా కల్యాణి ప్రతిభ చూపి రాణించారని ప్రధానోపాధ్యాయుడు ఈ వేదమూర్తి తెలిపారు. పాఠశాలలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాయామ ఉపాధ్యాయుడు జంగం వెంకట్రావు పర్యవేక్షణలో తమ పాఠశాల విద్యార్థు లు పలువురు జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణిస్తున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ వెంకట్రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో బదిలీలు

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 2, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ కమిషనర్ సూర్యతేజ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. అవి బుధవారం వెలుగులోకి వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగంలో సూపరింటెండెంట్‌గా ఉన్న వీ పద్మావతిని ఎలక్షన్ సెల్‌కు, పబ్లిక్‌హెల్త్‌లో సూపరింటెండెంట్‌గా ఉన్న ఏవీ సులోచనను రెవెన్యూకు మార్చారు. టౌన్ ప్లానింగ్‌లో ఉన్న కే పద్మను హౌసింగ్‌కు, జీఎస్‌డబ్ల్యూలో ఉన్న సీనియర్ సహాయకుడు మునిరత్నాన్ని టౌన్‌ప్లానింగ్‌కు. రెవెన్యూలో ఉన్న పీ శ్రీనివాసులును ఆరోగ్య విభాగానికి, అకౌంట్స్ విభాగంలో ఉన్న సీనియర్ సహాయకురాలు బీ విజయను జీఎస్ డబ్ల్యూ విభాగానికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఎన్ నరేంద్రను కమాండ్ కంట్రోల్ విభాగం నుంచి ఇంజనీరింగ్ విభాగానికి, హౌసింగ్‌లో ఉన్న సీనియర్ సహాయకుడు జీ బాలసుబ్రహ్మణ్యంను మెప్మా విభాగానికి బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, జూనియర్ సహాయకులుగా ఉన్న సీవీఎస్ కిరణ్, టీ రవి కుమార్, ఎల్‌పీ వరప్రసాద్‌కు సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వీరితోపాటు వెహికల్ షెడ్డు, సచివాలయాలు, శానిటేషన్ విభాగాల్లోని ఉద్యోగుల స్థానాలు కూడా మార్చారు.

రిజర్వ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి: బీటీఏ



విద్యాశాఖ ఏడీ గ్లోరీకుమారికి వినతిపత్రం అందిస్తున్న బీటీఏ నేతలు


నెల్లూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం రూపొందించి రిజర్వ్ కేటగిరి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని బీటీఏ నాయకులు కోరారు. జిల్లా విద్యాశాఖ రూపొందించిన సీనియారిటీ జాబితాలోని పొరపాట్లను సరిదిద్దా లని కోరుతూ వారు బుధవారం విద్యాశాఖ ఏడీ గ్లోరీ కుమారికి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ప్రస్తుతం విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా కేవలం మెరిట్ ప్రకారం రూపొందించిందని చెప్పారు. దీనివల్ల రిజర్వ్ కేటగిరిలో ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఉపాధ్యాయు లు తీవ్రంగా నష్టపోతారన్నారు. జీవో నెం 90 ప్రకారం మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే సీనియారిటీ జాబితాలు రూపొందించాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు, ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, ఉపాధ్యక్షుడు అన్నపల్లి శ్రీనివాసులు, కార్యదర్శులు రాజశేఖ ర్, రమణయ్య పాల్గొన్నారు.



నడకదారిలో సగం మెట్లు దాటగానే అలసిపోతున్నారు. ఛాతీ నొప్పితో కుప్పకూలుతున్నారు. నిర్జీవులుగా మారుతున్నారు కొందరు.

తిరుమలలోని ముఖ్య ప్రదేశాల్లోనూ మరికొందరు గుండె పట్టుకుని విలవిలలాడుతూ కూర్చుంటున్నారు. ఆస్పత్రికి తీసుకెళ్లే సరికి విగతజీవులవుతున్నారు.

ఇలా దైవదర్శనానికి వచ్చే భక్తుల్లో గుండెపోటు మరణాలు ఇటీవల పెరిగాయి. ఏడాది కాలంలో దాదాపు 157 మంది భక్తులు గుండెపోటుతో మృతి చెందడం టీటీడీని కలవరపరిచింది. ఈ క్రమంలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది.



నడకదారుల్లో గుండెపోటు



అలిపిరి నడకమార్గం

ఇటీవల పెరిగిన మరణాలు

తిరుమలలోని ముఖ్య ప్రదేశాల్లోనూ ఇదే పరిస్థితి

ఏడాది కాలంలో 157 మంది మృత్యువాత

నివారణపై దృష్టిసారించిన టీటీడీ

తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి దర్శనానికి వచ్చేవారిలో దాదాపు 40 శాతం మంది భక్తులు తమకున్న మొక్కుల మేరకు అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గాల్లో తిరుమలకు చేరుకుంటారు. అయితే కొవిడ్ అనంతరం కాలినడకన వచ్చే భక్తుల్లో చాలా మంది గుండెపోటుతో మృతి చెందుతుండటం టీటీడీకి ఆందోళన కలిగిస్తోంది. అప్పటివరకు బాగానే ఉన్న యాత్రికులు ఛాతీ నొప్పి అంటూ కుప్పకూలిపోయి కుటుంబానికి దూరమవుతున్నారు. ఒక కాలినడక మార్గాల్లోనే కాకుండా కంపార్టుమెంట్లు, క్యూలైన్లు, తిరుమలలోని కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లోనూ గుండెపోటు మరణాలు నమోదవుతున్నాయి.



గతేడాది డిసెంబరు 13న మృతిచెందడానికి ముందు అలిపిరిలో సీహెచ్ రవికుమార్ (ఇన్‌సెట్‌లో) రవికుమార్ మృతదేహం

ఇదీ లెక్క

గతేడాది జనవరిలో 14 మంది, ఫిబ్రవరిలో 11, మార్చిలో 12, ఏప్రిల్ 7, మే 8, జూన్ 11, జూలై 17, ఆగస్టు 9, సెప్టెంబరు 15, అక్టోబరు 10, నంబరు 8, డిసెంబరు 10, ఈఏడాది జనవరి 15, ఫిబ్రవరి 8, మార్చిలో (ఇప్పటి వరకు) ఇద్దరు చొప్పున 157 మంది గుండెపోటుతో చనిపోయారు. కాగా, మరికొందరు తీవ్ర అస్వస్థతతో తిరుపతిలోని వివిధ ఆస్పత్రుల్లో చేరి మృతి చెందిన సందర్భాలూ ఉన్నాయి.



గతేడాది డిసెంబరు14న మృతిచెందడానికి ముందు అలిపిరిలో సెల్ఫీ తీసుకున్న నవనీత్.. (పక్కన) నవనీత్ మృతదేహం

ఏడో మైలు వద్ద అపోలో కేంద్రం

మరోవైపు శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం అపోలో సంస్థ కొన్నేళ్లుగా ఉచితసేవలు అందిస్తోంది. అశ్విని ఆస్పత్రి పక్కనే ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఛాతీ నొప్పి అంటూ వచ్చేవారికి వివిధ రకాల పరీక్షలు చేయడంతో పాటు అత్యంత ఖరీదైన టెనెక్టిప్లెస్ అనే ఇంజెక్షన్ కూడా ఉచితంగా వేస్తున్నారు. ఇక, నడక మార్గాల్లో పెరుగుతున్న గుండెపోటు మరణాలను దృష్టిలో పెట్టుకుని అలిపిరి మెట్ల మార్గంలోని ఏడో మైలు వద్ద అపోలో సంస్థ 'అత్యవసర హృదయ చికిత్స కేంద్రం' ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. త్వరలోనే ఈసీజీ, డీఫిబ్ రిలేటర్, ఎకో కార్డియోగ్రామ్ వంటి పరికరాలతో వైద్యులను నియమించనున్నారు.

మరణాల నివారణ కోసం..

కాలినడకన వస్తూ తీవ్ర అలసటతో చాలా మంది భక్తులు మృతిచెందినట్టు టీటీడీ గుర్తించిది. అలాగే అనారోగ్యంతో ఉన్నవారూ మొక్కు తీర్చుకోవాలనే మొండితనంతో కొండెక్కుతూ చనిపోయినట్టు కూడా వైద్యుల ద్వారా తెలిసింది. ఈక్రమంలో శ్రీవారి దర్శనం కోసం వస్తూ గుండెపోటుతో ఇకపై ఎవరు మరణించకూడదనే లక్ష్యంతో టీటీడీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, గుండె సంబంధిత, మధుమేహం, అధిక రక్తపోటు, ఉబ్బసం, మూర్చ వంటి వ్యాధులున్న వారు కాలినడకన వెళ్లడం మంచిది కాదంటూ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా టీటీడీ సూచిస్తోంది.

- అలిపిరి నడకమార్గంలో ఇప్పటికే 1,500వ మెట్టు, గాలిగోపురం, భాష్యకార్ల సన్నిధి ప్రాంతాల్లో డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో సరిపడా వైద్యులను ఏర్పాటు చేయాలనే అధికారుల ఆదేశాల మేరకు గుండెకు సంబంధించిన ప్రత్యేక నిపుణలు ఏర్పాటు చేశారు. ఒక్కో డిస్పెన్సరీలో నలుగురు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాల్లో ఈసీజీ, డీ ఫిబ్‌రిలేటర్ వంటి పరికరాలను, క్యాన్వాస్ స్ట్రచర్స్‌ను సమకూర్చుకున్నారు.
- ఇక, శ్రీవారిమెట్టు మార్గంలోని 1,200వ మెట్టు వద్ద కూడా మరో డిస్పెన్సరీని ఏర్పాటు చేసే అంశంపై టీటీడీ ప్రణాళిక రూపొందించుకుంటోంది.
- భక్తులు దర్శనం కోసం వేచిఉండే వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో ఉన్న డిస్పెన్సరీలోనూ సరిపడా వైద్యులను ఏర్పాటు చేయనున్నారు.
- వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోనూ నూతన డిస్పెన్సరీ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. ఇటీవల 13 మంది వైద్య సిబ్బందిని కూడా కొత్తగా నియమించారు. ఇక, భక్తులు ఏదైనా ఇబ్బందికి గురైతే వైద్యులు వచ్చేవరకు నిరీక్షించకుండా సమీపంలోని సిబ్బందే సీపీఆర్ చేసేలా శిక్షణ ఇస్తున్నారు.

పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చేటప్పటికి అతడు ఓ అనుమానితుడు మాత్రమే. విచారించాక తెలిసింది అతడు కర్ణాటక రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ దొంగ అని. అలాంటి నిందితుడిని రిసెప్షన్ గదిలో వదిలేశారు. ఎంచక్కా అతడు పరారయ్యాడు. ఇంతటి నిర్లక్ష్యానికి బాధ్యులుగా ఇద్దరు ఐడీ పార్టీ కానిస్టేబుళ్లను సస్పెండు చేసినా.. అధికారుల పాత్ర ఎంతన్న ప్రశ్నలూ ఎదురవుతున్నాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఈ నిర్లక్ష్యానికి బాధ్యులెవరు?

- అంతర్రాష్ట్ర దొంగ పరారీ ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు
- అధికారుల వైఖరిపైనా తలెత్తుతున్న ప్రశ్నలు

బెంగళూరు సమీపం యలహంకకు చెందిన గొల్ల ఎల్లప్ప కొందరితో కొలిసి అక్కడి వెంట్రుకల గోడౌన్‌లో దొంగతనం చేశాడు. దీనిపై సూలదేవరహళ్లి పోలీసులు కేసు నమోదుచేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం ఎస్కార్ట్‌తో స్టేషన్‌కు తీసుకొస్తుండగా పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. అతడి కోసం కర్ణాటక పోలీసులు ముమ్మురంగా గాలిస్తున్నారు. రెండు, మూడు రాష్ట్రాల క్రైం ఐడీ పార్టీ గ్రూపుల్లో ఇతడి వివరాలు, ఫొటోలు ఉంచారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం రేణిగుంట వారపు సంతలో అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న ఓ వ్యక్తిని ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు సూరి, సోమశేఖర్ పట్టుకుని అర్బన్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అతడి వేలిముద్రలు, కనుబొమ్మలు, ఫొటోలు పరిశీలించగా కర్ణాటక రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ దొంగగా గుర్తించారు. స్టేషన్‌కు పక్కనే ఉన్న రిసెప్షన్ గదిలో ఉంచారు. కర్ణాటక పోలీసుల నుంచి తప్పించుకున్న ఇతడిని గట్టి బందోబస్తు మధ్య స్టేషన్ లాకప్‌లో ఉంచాల్సిపోయి.. అలా నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఎల్లప్ప పారిపోయాడు. దీనికి బాధ్యులెవరన్నది చర్చనీయాంశంగా మారింది. వారపు సంతలో నుంచి నిందితుడిని స్టేషన్‌కు తీసుకొచ్చాక బాధ్యత ఎవరిది? తీసుకొచ్చిన వాళ్లదేనా? స్టేషన్‌లో సెంట్రీ లేరా? నిందితుడు పారిపోకుండా అధికారులు చేపట్టిన చర్యలేంటి? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. రేణిగుంట స్టేషన్‌లో సెంట్రీ.. రిసెప్షన్ డ్యూటీలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. ఇందులో అధికారుల బాధ్యతపైనా సమగ్ర విచారణ జరపాల్సిన అవసరముంది.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

రేణిగుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్ పోలీసు స్టేషన్ నుంచి అంతర్రాష్ట్ర దొంగ పరారైన ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండయ్యారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి బుధవారం ఆంధ్రజ్యోతిలో 'అంతర్రాష్ట్ర దొంగ పరార్' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఎస్పీ హర్షవర్ధన రాజు స్పందించి, పూర్తి నివేదిక అందజేయాలంటూ డీఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ మేరకు ఐడీ పార్టీకి చెందిన కానిస్టేబుళ్లు సూరి, సోమశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.



జూపార్కు రోడ్డులోని టీసీఎస్ అయాన్ డిజిటల్ జోన్‌లో జరిగిన పరీక్షకు హాజరైన విద్యార్థులు







జేఈఈ మెయిన్స్-2 పరీక్షలు ప్రారంభం

- రెండు సెషన్లలో 1088 మంది హాజరు
- ఆలస్యంతో వెనుదిరిగిన ఇద్దరు అభ్యర్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2 పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జూపార్క్ సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్‌లో ఈనెల 9 వరకు ఈపరీక్షలు జరుగనున్నాయి. ఉదయం సెషన్‌కు 601 మందికిగాను 40 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 555 మందికిగాను 28 మంది గైర్హాజరయ్యారు. ఎన్‌టీఏ సూచనల మేరకు ఉదయం సెషన్‌కు రెండు గంటలు ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. వీరిని సిబ్బంది నిశితంగా తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించారు. సెల్‌ఫోన్లు, వాచ్‌లు లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలనే కాకుండా ఆభరణాలు,తలకు పెట్టుకునే క్లిప్పులు, ముంజేతులకు కట్టిన దైవ సంబంధిత తాళ్లపైనా అభ్యంతరం తెలియజేశారు. ఫుల్‌హ్యాండ్స్ టీషర్టులు, ఎత్తు మడమల చెప్పులు, ఎక్కువ జేబులున్న జీన్స్ ప్యాంట్లు ఉన్నా అనుమతించలేదు. అర్ధగంట ముందుగానే అంటే ఉదయం 8.30 గంటలకే కేంద్రం గేట్లు మూసివేశారు. గేట్లు మూసివేశాక 8.40 గంటలకు ఇద్దరు విద్యార్థులు పరుగున వచ్చినా అధికారులు అనుమతించలేదు. వారిద్దరూ నిరాశగా వెనుదిరిగారు. అడ్మిట్ కార్డులో నిబంధనల మేరకు పత్రాలతో, డ్రస్ కోడ్‌తో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ కైలాష్‌నాథ్ అభ్యర్థులకు సూచించారు.



గేటు మూసేయడంతో..

గంజాయి నిందితుల్లో జీఆర్పీ కానిస్టేబుల్

- 5 కిలోలు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో జీఆర్పీ కానిస్టేబుల్ సహా ఇద్దరు పట్టుబడ్డారు. ఈ వివరాలను గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ బుధవారం రాత్రి వెల్లడించారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అవినాష్ సూళ్లూరుపేటలో జీఆర్పీ ఓపీలో కానిస్టేబుల్. గతేడాది నుంచి ట్రైన్‌లో బీట్ డ్యూటీకి వెళ్లినపుడు పోలీసులను చూసి నిందితులు వదిలేసిన గంజాయిని గుట్టుగా ఇంటికి తీసుకొచ్చేవాడు. తన స్నేహితుడు సునీల్ ద్వారా కిలో రూ.15వేల చొప్పున విక్రయించేవాడు. ఇందులో కిలోకు రూ.2వేలు సునీల్‌కు కమీషన్ ఇచ్చేవాడు. గత నెల 23వ తేదీన సునీల్ ద్వారా తిరుపతికి చెందిన వ్యక్తులకు రెండు కిలోల గంజాయి విక్రయించాడు. బుధవారం 5 కిలోల గంజాయిని తన స్కూటర్‌లో తీసుకొచ్చి సునీల్ ద్వారా అమ్మించేందుకు అవినాష్ ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు గోపాల్, సుబ్రహ్మణ్యం రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వడమాలపేటలో పట్టుబడిన తల్లీ కొడుకులు



పుత్తూరు అర్బన్/ వడమాలపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చేసిన తప్పునే మళ్లీ చేసి పట్టుబడిందో మహిళ. ఈసారి కుమారుడు తోడయ్యాడు. పుత్తూరు ఎక్సైజ్ సీఐ, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా వడమాలపేటలో దాడులు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తూ వడమాలపేట గుంటకట్టకు చెందిన కె.వల్లెమ్మ, ఆమె కుమారుడు డిల్లీప్రసాద్ పట్టుబడ్డారు. ఈమె ఇంట్లో తనిఖీ చేయగా రూ.9,600 విలువైన 700 గ్రాముల గంజాయి, లావాదేవీలు జరిపిన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు. కాగా, వల్లెమ్మ 2016-17లో గంజాయి కేసులో అరెస్టయి ఏడాది జైలు శిక్ష అనుభవించడంతో పాటు రూ.10 వేలు జరిమానా చెల్లించినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. ఎస్ఐలు శివప్రసాద్, స్వామినాథన్, సిబ్బంది పాల్గొన్నారు.

మాకొక ఇన్‌చార్జి కావలెను!

- టీడీపీ కేంద్ర కార్యాలయానికి సత్యవేడు పంచాయితీ



పల్లా శ్రీనివాసరావును కలిసిన టీడీపీ నేతలు

సత్యవేడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ టీడీపీ వ్యవహారం మరోసారి వార్తల్లో నిలిచింది. ఎమ్మెల్యే ఆదిమూలం తీరుపై నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు అసంతృప్తి వ్యక్తం చేస్తూ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే స్థానంలో ఎవరినైనా ఇన్‌చార్జిని నియమించాలని కోరినట్లు సమాచారం. ఏపీ యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నరసింహయాదవ్ ప్రమాణ స్వీకారానికి నియోజకవర్గం నుంచి విజయవాడకు వెళ్లిన టీడీపీ నేతలు ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కేంద్ర కార్యాలయంలో కలిసి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వైసీపీ నేతలకే ఆయన ఎక్కువ ప్రాధాన్యమిస్తూ టీడీపీ నేతలను అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు, బాధలు పడ్డామని, ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చినా అవే పరిస్థితులు ఎదుర్కొంటున్నామని ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిసింది. నియోజకవర్గంలో అధికారుల నుంచి సిబ్బంది వరకు వైసీపీ నేతల మాటలే చెల్లుబాటు అవుతున్నాయని, దీనికి ఎమ్మెల్యే కుమారుడి ప్రమేయమే ప్రధాన కారణమని పల్లాకు వారు వివరించినట్లు సమాచారం. ఎమ్మెల్యే ఆదిమూలంతో వేగలేమని త్వరలో నియోజకవర్గానికి ఇంచార్జిని నియమిస్తే తామందరం కలిసి పనిచేస్తామని, లేకుంటే పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పినట్లు తెలిసింది. నియోజకవర్గ టీడీపీ నేతల ఫిర్యాదు విన్న పల్లా.. మీకు ఇంచార్జిగా ఎవరు కావాలని అడగ్గా పలువురు మాజీ ఎమ్మెల్యే హేమలత పేరు ప్రస్తావించినట్లు సమాచారం. పార్టీ అధినేత చంద్రబాబుతో చర్చించి ఈ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.



నరసింహయాదవ్ చేత ప్రమాణం చేయిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నరసింహయాదవ్ అను నేను..

యాదవ సంక్షేమాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తుడా మాజీ ఛైర్మన్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈయనతో పాటు డైరెక్టర్ల చేత మంత్రి అచ్చెన్నాయుడు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వైకుంఠం-1 వద్ద కొత్త షెడ్

● రూ.300 దర్శన భక్తుల కోసం..

నిర్మాణంలో రూ.300 దర్శన భక్తుల అదనపు షెడ్

తిరుమలలో వైకుంఠం1 క్యూకాంప్లెక్స్ వద్ద కొత్త షెడ్ నిర్మాణం జరుగుతోంది. గతంలో రూ.300 దర్శన భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్ ప్రస్తుతం ఇరుకుగా మారిపోయింది. క్యూలైన్ కూడా వెలుపలకు వచ్చేస్తోంది. దీంతో రూ.300 దర్శన టికెట్లు బుక్ చేసుకుని దర్శనానికి వస్తున్న భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని గుర్తించిన టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అదనపు షెడ్‌ను నిర్మించాలని సూచించారు. సమాచారకేంద్రం వద్దనున్న డిస్ప్లే టీవీ వద్ద నుంచి వైకుంఠం1 కాంప్లెక్స్ ప్రవేశం వరకు అదనపు షెడ్ నిర్మాణం కోసం రూ.1.06 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇది పూర్తయితే వెయ్యి నుంచి 1,500 మంది భక్తులు ఇందులో వేచి ఉండవచ్చు. నెలలో ఈ షెడ్ భక్తులకు అందుబాటులోకి రానుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గ్రానైట్ క్వారీలో పేలుళ్లు

● బాలుడికి తీవ్ర గాయాలు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సమీపంలోని చెర్లోపల్లెలో గ్రానైట్ క్వారీలో పేలుళ్ల కారణంగా రెండేళ్ల బాలుడు దినేష్ తలకు తీవ్ర గాయమైంది. స్థానికుల కథనం మేరకు.. కృష్ణంరాజుకు చెందిన మామిడి తోటలో రమేష్ కుటుంబం కాపలాగా ఉంటుంది.ఆ పక్కన గ్రానైట్ క్వారీలో బుధవారం మధ్యాహ్నం నిర్వాహకులు పేలుళ్లు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ రాయి రమేష్ కుమారుడు దినేష్‌కు తగలడంతో తలకు తీవ్రగాయమైంది. బాలుడిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నట్లు సమాచారం.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.5.09 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,981

తలనీలాలు సమర్పించినవారు: 21,120





ఇప్పుడు గోదాముకు ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డు



గత ఏడాది డిసెంబరులో ఏకొల్లులోని గోదాము చుట్టూ చేరిన వర్షపు నీరు (ఫైల్ ఫోటో)

చెరువులో గోడౌన్

● వైసీపీ పాలనలో ముందుచూపు లేక రూ.40 లక్షలతో నిర్మాణం

● వర్షాల్లో జలదిగ్బంధంలో చిక్కుకున్న వైనం

● ఇప్పుడు మరో రూ.27 లక్షలతో సిమెంటు రోడ్డు

● అధికారుల తీరుపై విమర్శలు

చెరువులో గోదాము కట్టొద్దని అప్పుడే రైతులు మొత్తుకున్నారు. అయినా, నాటి వైసీపీ పాలనలో చెవికెక్కించుకోలేదు. కట్టి తీరతామన్నట్లు భీష్మించారు. ఫలితం.. ఆ తర్వాత వర్షాలకు నీళ్లల్లో చిక్కుకుపోయిందా గోదాము.

ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చింది. అయినా, అధికారుల తీరు మారలేదు. చెరువులోని ఆ గోదాముకు రూ.27 లక్షలతో కొత్తగా రోడ్డేశారు. వైసీపీ పాలకులు చేసిన తప్పును కప్పిపుచ్చడానికే ఈ పని చేశారన్న విమర్శలు వస్తున్నాయి.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

రైతులు ధాన్యం నిల్వ చేసుకుని, సరైన మద్దతు ధరకు అమ్ముకునేలా 2022లో వైసీపీ ప్రభుత్వం దొరవారిసత్రం మండలానికి నాలుగు గోదాములను మంజూరు చేసింది. ఒక్కో దానికి నాబార్డు ద్వారా ఎన్‌డీసీసీబీ రుణంతో రూ.40 లక్షలు మంజూరు చేశారు. నెలబల్లి, ఏకొల్లు, వేణుంబాక, తొగరాముడి గ్రామాల్లో.. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వీటిని నిర్మించారు. నాటి వైసీపీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఏకొల్లు గోదామును అనువైన ప్రదేశంలో నిర్మించలేదు. ఏకొల్లు రోడ్డుకు పక్కనే, రెడ్డిగుంట చెరువులో నిర్మించారు. దీనివల్ల ఆ గోదాము రైతులకు ఉపయోగపడదనే విషయాన్ని అధికారులు నిర్లక్ష్యంగా తీసుకొన్నారు. దీంతో లక్ష్యం మంచిదైనా ఆచరణలో నీరుగారింది. గత వర్షాకాలంలో చెరువు నీరు గోదామును చుట్టుముట్టేయడంతో రైతులంతా ఆవేదన వ్యక్తంచేశారు.



సిమెంట్ రోడ్డు పనులకోసం.. పక్కనే చెరువు మట్టి తీయడంతో ఏర్పడిన గుంత

దీనిని గుర్తించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శిస్తున్నారు. ఇలా గత ప్రభుత్వంలో రూ.40 లక్షలను 'నీటి'పాలు చేశారు.

ఆ రోడ్డూ అంతంతమాత్రమే

2023-24లో నీటిలో గోదాము జలదిగ్బంధమైన వైనాన్ని అధికార యంత్రాంగం కళ్లారా చూసినా మేలుకోలేదు. సరికదా మరో తప్పిదానికి పాల్పడింది. రూ.27 లక్షలతో అక్క సిమెంట్ రోడ్డు వేయించింది. ప్రస్తుత ప్రభుత్వం రోడ్లకు నిధులు ఇవ్వడాన్ని అధికారులు తమకు అనుకూలంగా మలచుకుని.. గతంలో తమ తప్పు బయటపడకుండా ఆదరాబాదరాగా లోతట్టు ప్రాంతంలోని గోదాముకు రోడ్డు వేయించారు. దీనికితోడు అక్కడే ఉన్న చెరువులో తవ్విన మట్టితో రోడ్డు వేశారు. దీనిపైనే సిమెంట్ రోడ్డు వేశారు. మట్టి పనుల్లో కనీసం రోలింగ్ నియమాన్ని పాటించలేదనే విమర్శలున్నాయి. రోడ్డుకు ఆనుకునే మట్టిని తవ్వారు. సిమెంట్ రోడ్డు పనుల్లోనూ నాణ్యత కొరవడింది. వర్షాకాలంలో ఈ రోడ్డు వరద తాకిడికి కొట్టుకుపోయే ప్రమాదముందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సమీపంలోనే తెలుగంగ కాలువ ఉంది. ఈ కాలువకు గత డిసెంబరులో పడిన గండిని ఇప్పటికీ పూడ్చలేదు. ఆ గండి ద్వారా వరద నీరొస్తే గోదామును ముంచెత్తుతుందంటున్నారు. జాతీయ రహదారి పక్కన ఖాళీ భూమిలో గోదాము నిర్మించి ఉంటే ఉపయోగపడే బాగుండేదని రైతులు చెబుతున్నారు.

వీఆర్‌కు గాజులమండ్యం హెడ్ కానిస్టేబుల్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డిని వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ హర్షవర్ధన రాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు ఎనిమిదేళ్లుగా ఒకేచోట ఉంటున్న ఈయనపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినట్లు తెలిసింది. దీనిపై ఎస్పీ సందిస్తూ స్పెషల్ బ్రాంచ్ అధికారులను విచారణకు ఆదేశించారు. వీటన్నింటిపై సమగ్రంగా విచారణ చేపట్టిన ఎస్బీ అధికారులు ఎస్పీకి నివేదిక సమర్పించారు. దీనిపై వెంటనే హెడ్ కానిస్టేబుల్ పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డిని వీఆర్‌కు పంపుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరైనా సరే భూదందాలు, సెటిల్‌మెంట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ సీనియర్ నేత ధనంజయులు మృతి



ధనంజయులు నాయుడు (ఫైల్ ఫొటో)

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, తిరుపతికి చెందిన గాలి ధనంజయులు నాయుడు(83) మృతిచెందారు. బైరాగిపట్టెడ ఎంకే నాయుడు కాలనీలోని ఆయన స్వగృహంలో బుధవారం సాయంత్రం కార్డియాక్ అరెస్ట్‌తో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమార్తె, బీజేపీ నాయకురాలు గాలి పుష్పలత చెప్పారు. ఈయన 1977కు ముందునుంచే జనతా పార్టీలో పనిచేశారు. 1980లో బీజేపీగా రూపాంతరం చెందడంతో అందులోనూ చురుగ్గా పనిచేశారు. 1985లో బీజేపీ నగర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1990లో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 1999లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. తన కుమార్తె గాలి పుష్పలతను వారసురాలిగా రాజకీయ క్షేత్రంలోకి దింపారు. కుమారుడు గాలి భరత్ కుటుంబం అమెరికాలో ఉండటంతో ఆయన వచ్చాక శుక్రవారం ఉదయం గోవిందధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పార్థివదేహాన్ని స్విమ్స్ మార్చురీలో భద్రపరిచారు.





విద్యుత్ దీపాలంకరణలో దర్గా, ఆర్చి

నేటినుంచి హజరత్ అమీర్‌షావలి ఉరుసు

● ఎమ్మెల్యే విజయశ్రీ చొరవతో 8 ఏళ్ల తరువాత ప్రారంభం

నాయుడుపేట/టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో హిందూ.. ముస్లింల ఐక్యతకు ప్రతీకగా.. కులమతాలకు అతీతంగా జరుపుకునే హజరత్ అమీర్‌షావలి గంధోత్సవ వేడుకలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. 3, 4, 5 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉరుసు ఉత్సవాలను మొదటసారి 1960లో ప్రారంభించారు. అప్పటి నుంచి హిందూ.. ముస్లింలు కులమతాలకు అతీతంగా ఐక్యతతో ఉరుసు జరుపుకుంటుండంతో ప్రత్యేకత సంతరించుకుంది. 2016 వరకు నిర్విఘ్నంగా సాగిన ఉరుసు ఉత్సవాలు... నిర్వహణ విషయమై వివాదాలు నెలకొనడంతో 2017 నుంచి ఆగిపోయాయి. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం చొరవ తీసుకొని కమిటీ సభ్యులతో సంప్రదింపులు జరిపి ఈ ఏడాది ఉరుసు నిర్వహించేందుకు కృషి చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 3వ తేదీ గురువారం రాత్రి శ్రీవారి గంధం... దొర్నాదుల చెంచుకృష్ణయ్య ఇంటి వద్ద నుంచి బయలుదేరి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, ఫకీర్ల భజనల నడుమ పట్టణంతా ఊరేగి తెల్లవారుజామున దర్గా వద్దకు చేరుకొని రాపూరు వారి చేత చదివింపులు స్వీకరిస్తారు. 4వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు నిస్సి ఈవెంట్స్ ఆధ్వర్యంలో సినీ పాటకచ్చేరి. 5వ తేదీ శనివారం మధ్యాహ్నం అన్నదానం, రాత్రి జబర్దస్త్ టీమ్ ఆర్కెస్ట్రా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉరుసు ఉత్సవాలకు ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు రానుండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, 14 మంది ఎస్ఐలు, 212 మంది పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

●12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి

●30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉంటూ మరణించిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారసులకు వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో నిరసన చేపట్టాయి. ఫ్యాప్టో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ కరోనా సమయంలో మరణించిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు ఇవ్వకపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 2003 డీఎస్సీ వారిని పాతపెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయనందున ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో, డైట్ ప్రిన్సిపాల్, డీఈవో పోస్టులు అందని ద్రాక్షలా మారాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన 3 పెండింగ్ డీఏను వెంటనే విడుదల డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సీహెచ్ రమేష్, గాజుల నాగేశ్వరరావు, శేఖర్, రామచంద్రయ్య, మురళీకృష్ణ, జగన్నాథం, రమేష్, బాలసుబ్రహ్మణ్యం, విశ్వనాథ్, మల్లికార్జున, లక్ష్మయ్య పాల్గొన్నారు.



ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు ప్రారంభం

● పర్యవేక్షించిన ఇన్‌చార్జి వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్యా పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో 53 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో కల్పించిన వసతుల పట్ల వీసీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణపై కోర్టు, యూజీసీ, డెబ్ ఆదేశాలు పాటిస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో ఆరుగురు కిడ్నాపర్లు!

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలు.. మీ సేవలో నెలకొన్న విభేదాల కారణంగా రాజేష్ కుటుంబాన్ని కిడ్నాప్ చేసిన ఘటనలో ఆరుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఈనెల 29న తిరుపతి నగరం అక్కారంపల్లికి చెందిన అరుణ్, జీవకోనకు చెందిన భార్గవ్‌తో పాటు రేణిగుంటకు చెందిన మరో నలుగురు కలిసి కిడ్నాప్ చేసిన విషయం విదితమే. రాజేష్, భార్గవ్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఎలాగైనా రాజేష్ నుంచి రూ.రెండు కోట్లు దండుకోవాలనే దురుద్దేశంతో కిడ్నాప్‌కు పథకం రచించారు. దీనికోసం సెటిల్‌మెంట్లు, భూ దందాల్లో ఆరితేరిన అరుణ్‌ను సంప్రదించాడు. ఆ ప్రకారం ఈ నెల 29న రాజేష్‌ను అపార్టుమెంటు వద్దకు రావాలని ఫోనులో పిలిచాడు. గతంలో తన వద్ద తీసుకున్న రూ.20 లక్షలను తిరిగివ్వాలని రాజేష్ కొంతకాలంగా అడుగుతుండటం, భార్గవ్ వైఖరిపై అనుమానంతో ఇతడు తల్లి విజయ, భార్య సుమతి, ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్లాడు. తనకు రూ.రెండు కోట్లు ఇవ్వాలని భార్గవ్, అరుణ్ కలసి రాజేష్‌ను అడగ్గా అంత డబ్బులు లేవని చెప్పారు. అయితే ఇల్లు, ఆస్తులు రాసివ్వాలని బెదిరించారు. దీనికోసం రాజేష్‌ను ఒక కారులో, అతడి కుటుంబ సభ్యులను మరో కారులో ఎక్కించుకుని బెంగుళూరు వైపు వెళ్లారు. ఈ సందర్భంగా కిడ్నాపర్లు కొన్ని మారణాయుధాలతో బెదిరించినట్లు సమాచారం. రాజేష్ తప్పించుకోవడం, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అందరినీ వదిలేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రధాన నిందితుడైన అరుణ్‌తో పాటు భార్గవ్, రేణిగుంటకు చెందిన మరో నలుగురిని అలిపిరి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఘటన జరిగిన మరుసటి రోజు కిడ్నాపర్ల కదలికలపై సీఐ రాంకిషోర్, అలిపిరి ఎస్ఐలు నాగార్జున రెడ్డి, లోకేష్ బాబు నిఘా ఉంచి చాకచక్యంగా బెంగళూరు, హైదరాబాదుకు వెళుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇద్దరు ప్రధాన నిందితులపై రౌడీషీట్లు ఓపెన్ చేసే యోచనలో పోలీసులున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నరసింహరావు

భూగర్భ డ్రైనేజీ క్లీన్ చేస్తూ కార్మికుడి మృతి

● అపస్మారక స్థితిలో మరో ఇద్దరు



నాగరాజు (ఫైల్‌ఫొటో)



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోట శివ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్ పాలెంలో భూగర్భ డ్రైనేజీలో వ్యర్థాలను తొలగించే క్రమంగా ఊపిరాడక కార్మికుడు నాగరాజు(41) మృతి చెందగా, మరో ఇద్దరు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇక్కడి భూగర్భ డ్రైనేజీలో వ్యర్థాలు నిల్వచేరి.. మురుగు ముందుకు సాగక దుర్వాసన వస్తోంది. దీనిని శుభ్రం చేసేందుకు బుధవారం నలుగురు కూలీలు వచ్చారు. మ్యాన్‌హోల్ నుంచి నాగరాజు లోపలకు దిగారు. వ్యర్థాలను కాస్త తొలగించగా, ఎగువ నుంచి మురుగునీరు వచ్చింది. ఆ దుర్వాసన, వాయువులతో ఊపిరాడక అపస్మారక స్థితికి చేరారు. పది నిమిషాల తరవాత నాగరాజును పిలిచినా స్పందన లేకపోవడంతో తోట గురువయ్య అనే మరో కార్మికుడు దిగారు. ఎంతసేపటికీ వీరిద్దరు బయటకు రాకపోవడంతో శివ, తుపాకుల ధర్మ లోపలకు దిగారు. అప్పటికే నాగరాజు మృతి చెందగా, గురవయ్య అపస్మాకర స్థితిలో ఉన్నారు. వెంటనే నాగరాజు మృతదేహంతో పాటు గురవయ్యను బయటకు తీసుకొచ్చారు. అదే సమయంలో శివ కూడా అపస్మారక స్థితికి చేరారు. వెంటనే షార్ రోడ్డులోని సతీష్‌ధావన్ మెమోరియల్ వైద్యశాలకు తరలించారు. ప్రథమిక చికిత్స అనంతరం తోట శివ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ నరసింహారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనేది ఆరా తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నాగరాజు స్వగ్రామం సూళ్లూరుపేట మండలంలోని దావాదిగుంట. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

ఎస్వీయూలో చిరుత దాడిలో జింక మృతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో ఓ జింకను చిరుత చంపినట్టు తెలుస్తోంది. ఈ ఘటనను బుధవారం సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుత సంచారం ఆనవాళ్లను పరిశీలించారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. కొన్ని రోజులుగా ఎస్వీయూలో సెంట్రల్ లైబ్రరీ, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, ఇంజినీరింగ్ కాలేజీ పరిసరాల్లో చిరుత సంచారం కనిపిస్తోంది. లైబ్రరీ, ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంతాల్లో కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు జింకలను చంపడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

● 1.85 లక్షల జవాబు పత్రాలు.. 775 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి 9వ తేది వరకు తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరగనుంది. దీనిని అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ బుధవారం వెల్లడించారు. జిల్లాకు 1.85 లక్షల జవాబు పత్రాలను కేటాయించారు. వీటి మూల్యాంకనంకోసం ఇద్దరు చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు, 130 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 775 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 260 మంది స్పెషల్ అసిస్టెంట్లు, 10 మంది అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లను నియమించారు. అలాగే ఓపెన్ స్కూల్‌కు సంబంధించి జిల్లాకు 16,324 జవాబు పత్రాలను కేటాయించారు. వీటి మూల్యాంకనానికి 21 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 100 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 21 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. ప్రతి ఎగ్జామినర్ రోజుకు 40 పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. వేసవి నేపథ్యంలో కేంద్రంలో ఫ్యాన్లు, లైట్లు, విస్తృతంగా ఏర్పాటు చేశామని డీఈవో కుమార్ చెప్పారు.